

అనకాపల్లి నెహ్రూచౌక్‌లో వర్షంలో తడుస్తూనే పూజ సామగ్రి కొనుగోలు చేస్తున్న భక్తులు

ముసురు

అల్పపీడనం ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా వర్షాలు

- పలు మండలాల్లో కుండపోత
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- స్తంభించిన జన జీవనం
- చెరువుల్లోకి సమృద్ధిగా వర్షం నీరు
- పొంగి ప్రవహిస్తున్న గెడ్డలు, వాగులు



పరవాడ పెద్ద చెరువు మదుం పైనుంచి పారుతున్న వర్షం నీరు



అనకాపల్లి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న శారదా నది

అనకాపల్లి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి- న్యూస్ నెట్‌వర్క్): ఉత్తర ఒడిశాకు అనుకుని వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో సోమవారం అర్ధరాత్రి నుంచి జిల్లాలో ముసురు వాతావరణం నెలకొంది. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు దఫదఫాలుగా వర్షం కురుస్తున్నది. పలు మండలాల్లో భారీ వర్షం పడగా, మిగిలిన మండలాల్లో మోస్తరు వర్షం పడింది. కె.కోటపాడు, చోడవరం, కశింకోట, పరవాడ మండలాల్లో 80 మిల్లీమీటర్లకు పైబడి వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. చెరువుల్లోకి సమృద్ధిగా నీరు చేరింది. నదులు, వాగులు, గెడ్డల్లో వరద ప్రవాహం పెరిగింది. ఎడ తెరిపి లేకుండా వర్షం కురవడంతో సాధారణ జనజీవనం స్తంభించింది. గ్రామీణ రహదారుల మరింత దెబ్బతిన్నాయి. వడ్డాది వద్ద పెద్దేరు నది ఉధృతంగా ప్రవహిస్తున్నది. అనకాపల్లిలో మంగళవారం తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తున్నది. ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో వర్షం నీరు నిలిచిపోయి చెరువును తలపించింది. విజయరామరాజుపేట అండర్‌బ్రిడ్జి వద్ద నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. అనకాపల్లి -అచ్యుతాపురం రోడ్డులో పురాతన కల్వర్టులు శిథిలావస్థకు చేరడంతో ఈ మార్గంలో వెళ్లాల్సిన భారీ వాహనాలను పోలీసులు దారి మళ్లించారు. కాగా విస్తారంగా కురుస్తున్న వర్షాలు రైతులకు ఎంతో మేలు చేస్తాయని వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు అంటున్నారు. ఇప్పటికే వరినాట్లు వేసిన పొలాల్లో అదనపు నీటిని బయటకు పంపుతున్నారు. మరో రెండురోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం వుందన్న వాతావరణ శాఖ సమాచారంతో జిల్లా అధికారులు అప్రమత్తమయ్యారు. కలెక్టర్ విజకృష్ణన్ మంగళవారం అన్ని మండలాల అధికారులతో వెబెక్స్ నిర్వహించారు. అధిక వర్షాల వల్ల లోతట్టు ప్రాంతాల ప్రజలకు ... మిగతా 8వ పేజీలో



నిండు కుండలా పెద్దేరు జలాశయం

నిండిన పెద్దేరు

- జలాశయం గేటు ఎత్తి నీరు విడుదల

మాడుగుల రూరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దేరు జలాశయం నీటిమట్టం గరిష్ఠస్థాయికి చేరువగా ఉంది. ఎగువున కురుస్తున్న వర్షాలతో జలాశయంలోకి వరద నీరు వస్తున్నది. గరిష్ఠ నీటిమట్టం 137 మీటర్లు మంగళవారం సాయంత్రం 520 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోతో 136.55 మీటర్లకు చేరింది. వరద కొనసాగుతుండంతో రాత్రికి ఒక గేటు ఎత్తి 400 క్యూసెక్కుల నీటిని నదిలోకి విడిచిపెడతామని జలాశయం ఏఈ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణ జలమయం

అనకాపల్లి టౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షం కారణంగా ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో నీరు నిలిచి చెరువును తలపించింది. కాంప్లెక్స్‌లోకి బస్సులు వచ్చేటప్పుడు ప్లాట్‌ఫారంపైకి నీరు చొచ్చుకు రావడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. నీటితోపాటు మట్టి కూడా రావడంతో ప్లాట్‌ఫారం మురికి కూపంగా మారింది. వర్షం కారణంగా బస్సులు ఆలస్యంగా నడవడంతో ప్రయాణికులు ఎక్కువసేపు వేచివుండాల్సి వచ్చింది. మెయిన్ రోడ్డుకన్నా ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణ పల్లంగా ఉండడం, నీరు బయటకు పోవడానికి మార్గం సక్రమంగా లేకపోవడంతో వర్షం కురిస్తే ఆవరణ మొత్తం జలమయం అవుతున్నది.



ఆర్టీసీ కాంప్లెక్స్ ప్లాట్‌ఫారంలోకి చొచ్చుకొస్తున్న వర్షం నీరు

మార్కెట్‌లో వినాయక చవితి సందడి

- పూలు, పండ్లు, ఇతర సామగ్రి కొనుగోలుదారులతో బజార్లు రద్దీ

వినాయక చవితి పండుగ సందర్భంగా పూజా సామగ్రి అమ్మకం, కొనుగోలుదారులతో మంగళవారం మార్కెట్లు, బజార్లు కిటకిటలాడాయి. సోమవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తున్నప్పటికీ పూలు, పండ్లు, వినాయక ప్రతిమలు, ఇతర వస్తువులు కొనుగోలు చేయడానికి ప్రజలు వెనుకాడలేదు. అనకాపల్లిలోని నెహ్రూచౌక్, చిన నాలుగురోడ్ల జంక్షన్, పెరుగుబజార్ జంక్షన్ ప్రాంతాలు సందడిగా మారాయి. సాధారణ రోజులతో పోలిస్తే పూలు, పండ్లు, కొబ్బరి కాయల ధరలు బాగా పెరిగాయి.



ఎలమంచిలి మార్కెట్‌లో వినాయక చవితి రద్దీ

నేటి నుంచి స్వయంభూ విఘ్నేశ్వర ఉత్సవాలు


చోడవరం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక స్వయంభూ విఘ్నేశ్వరాలయం నవ రాత్రి ఉత్సవాలకు సిద్ధమైంది. స్వయంభూ గణపతి ఉత్సవాలు బుధవారం ఉదయం ఘనంగా ప్రారంభం కానున్నాయి. కార్యసిద్ధి వినాయకునిగా పేరున్న స్వయంభూ విఘ్నేశ్వరుడిని దర్శించుకోవడానికి ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ఇక్కడి వస్తుంటారు. సుమారు రెండు శతాబ్దాల క్రితం ఉద్భవించిన వినాయక విగ్రహం క్రమేపీ భూమిపైకి పెరుగుతుండడం విశేషం. ఉత్సవాల సందర్భంగా వారం రోజులపాటు ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్టు ఆలయ చైర్మన్ పసుమర్తి సాంబమూర్తి తెలిపారు.



ఆలయంలో పూజలందుకుంటున్న స్వయంభూ విఘ్నేశ్వరుడు

చెక్కపై గణనాథుని రూపం

నక్కపల్లి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినదొడ్డిగల్లు గ్రామానికి చెందిన సూక్ష్మ కళాకారుడు దార్ల రవి, వినాయక చవితి పండుగను పురస్కరించుకుని చెక్కపై గణపతి రూపాన్ని చెక్కాడు. సుమారు గంటన్నరసేపు శ్రమించి దీనిని తీర్చిదిద్దినట్టు చెప్పాడు. కార్పెంటర్‌గా పనిచేస్తున్న రవి.. ప్రత్యేక సందర్భాల్లో తన కళానైపుణ్యతతో సూక్ష్మ కళాఖండాలను తయారు చేస్తుంటాడు.



దార్ల రవి తయారు చేసిన చెక్కపై గణపతి రూపం

టీడీపీ పార్లమెంట్ పగ్గాలు ఎవరికో!?

'అనకాపల్లి' కమిటీ ఎంపికపై కసరత్తు

- జిల్లా నాయకుల అభిప్రాయలు సేకరించిన త్రీ మెన్ కమిటీ
- రేసులో పలువురు సీనియర్ నేతలు



(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి) తెలుగుదేశం పార్టీ అనకాపల్లి పార్లమెంట్ అధ్యక్షుడి ఎన్నికపై పార్టీ అధిష్ఠానం దృష్టి కేంద్రీకరించింది. పార్లమెంటు నియోజకవర్గం పార్టీ అధ్యక్షుడు, కార్యదర్శి, అనుబంధ సంస్థల కమిటీల నియామకాల కోసం ఇటీవల అనకాపల్లిలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు అధ్యక్షతన త్రీ మెన్ కమిటీ సమావేశమైంది. త్రీమెన్ కమిటీ సభ్యులైన పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, ఏపీ స్టేట్ మినిమమ్ వేజస్ అడ్వైజరీ చైర్మన్ శ్రీనివాసులురెడ్డి, ఏపీ ఇండస్ట్రియల్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డేగల ప్రభాకర్.. అనకాపల్లి జిల్లా ముఖ్య నేతలతో సమావేశమై అభిప్రాయాలు సేకరించారు. ప్రస్తుతం పార్టీ అధికారంలో వుండడంతో పార్లమెంటు పగ్గాలు చేపట్టేందుకు పలువురు ఆసక్తి చూపుతున్నారు. అయితే పార్లమెంట్ పార్టీ అధ్యక్షుడు, కార్యదర్శి ఇతర అనుబంధ సంఘాల నియామకంపై త్రీమెన్ కమిటీ సభ్యులు.. జిల్లాలో టీడీపీ సీనియర్ నేతలు, రాష్ట్ర కమిటీ సభ్యులు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల ఇన్‌చార్జిలు, పలు కార్పొరేషన్‌ల చైర్మన్‌లతో సుదీర్ఘంగా చర్చించారు. పదవులు ఆశిస్తున్న వారి పేర్లతో అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా జాబితాను రూపొందించారు. పార్లమెంట్ అధ్యక్ష పదవిని ఆశిస్తున్న వారిలో ప్రస్తుత అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, సీనియర్ నాయకులు దాడి రత్నాకర్, లాలం కాశీనాయుడు, మాదంశెట్టి నీలబాబు, కాయల మురళి, డాక్టర్ నారాయణరావు పేర్లు వినిపిస్తున్నాయి. తమకు అవకాశం కల్పించాలని పలువురు నేతలు ఇప్పటికే పార్టీ అధిష్ఠానానికి దరఖాస్తు చేసుకున్నట్టు తెలిసింది. అయితే సీనియారిటీ, విధేయత, రాజకీయ అనుభవం, సామాజిక సమీకరణలను పరిగణనలోకి తీసుకొని కమిటీని నియమించాలని పార్టీ అధిష్ఠానం భావిస్తున్నట్టు తెలిసింది. ప్రస్తుతం టీడీపీ పార్లమెంట్ పార్టీ అధ్యక్షుడిగా బత్తుల తాతయ్యబాబు కొనసాగుతున్నారు. సామాజిక సమీకరణల నేపథ్యంలో ఆయననే కొనసాగించాలని అధిష్ఠానం భావిస్తున్నట్టు తెలిసింది. ఈ మేరకు త్రీమెన్ కమిటీ వద్ద జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు ప్రతిపాదన చేసినట్టు సమాచారం. కొత్తగా నియమించనున్న టీడీపీ పార్లమెంట్ పార్టీ కమిటీలో ఒక అధ్యక్షుడు, ఏడుగురు ఉపాధ్యక్షులు, ఏడుగురు కార్యదర్శులు, ఏడుగురు కార్యనిర్వాహక కార్యదర్శులు, ఏడుగురు అధికార ప్రతినిధులు ఉంటారు. ప్రధాన కమిటీ నియామకం పూర్తయిన తరువాత 17 అనుబంధ సంఘల కార్యవర్గాలను నియమిస్తారు.

ఆలయాల భూములు అన్యాక్రాంతం

దేవదాయ శాఖ నిర్లక్ష్యంతో నిర్వీర్యం అవుతున్న ఆస్తులు

- 200 ఎకరాలకు అక్రమంగా పట్టాదారు పాస్‌పుస్తకాలు
- వైసీపీ హయాంలో అడ్డగోలుగా జారీ చేసిన అధికారులు



వేంకటేశ్వర స్వామి ఆలయం

మాడుగుల, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): దేవదాయ శాఖ భూములను ఆక్రమించుకుంటున్న వ్యక్తులు.. రెవెన్యూ అధికారుల అండదండలతో వెబ్‌ల్యాండ్‌లో తమ పేర్లు నమోదు చేయించుకుని పట్టాదారు పాస్‌పుస్తకాలు పొందుతున్నారు. మరికొంతమంది రైతులు ఏళ్ల తరబడి దేవదాయ శాఖ భూములను సాగు చేసుకుంటూ, ఒక్క రూపాయి కూడా కౌలు చెల్లించడంలేదు. మండలంలో కోట్లాది రూపాయల విలువ చేసే ఆలయాల భూములు అన్యాక్రాంతం అవుతున్నప్పటికీ వాటిని కాపాడడంలో దేవదాయ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పూర్వకాలంలో మాడుగులను పాలించిన సంస్థనాధీసులు ఈ ప్రాంతంలోని ఆలయాల్లో ధూప, దీప, నైవేద్యాలకు ఇబ్బంది లేకుండా విరివిగా భూములను కేటాయించారు. మాడుగులోని పార్థసారథి ఆలయానికి 360.87 ఎకరాలు, వేంకటేశ్వర స్వామి ఆలయానికి 278.91 ఎకరాలు, రాధకాంతస్వామి ఆలయానికి 213.32 ఎకరాలు, భీమలింగేశ్వరస్వామి ఆలయానికి 20.80 ఎకరాలు, జగన్నాథస్వామి ఆలయానికి 29.62 ఎకరాలు, వేణుగోపాలస్వామి ఆలయానికి 48.57 ఎకరాలు, సీతారామస్వామి ఆలయానికి 75.54 ఎకరాలు, నూకాలమ్మ ఆలయానికి 12.37 ఎకరాలు వున్నట్టు రికార్డులు చెబుతున్నాయి. అప్పట్లో ఆయా భూములను రైతులు సాగు చేసుకుంటూ, ఏటా ఆలయాలకు కౌలు చెల్లించేవారు. కాలక్రమేణా దేవదాయ శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో సాగుదారులు కౌలు చెల్లించడం మానేశారు. అంతేకాక పలువురు సాగుదారులు.. దేవదాయ శాఖ భూములను తమ సొంత ఆస్తిగా భావిస్తున్నారు. మరోవైపు ఆలయాల్లో ధూప దీప నైవేద్యాలకు నిధుల కొరత ఏర్పడింది. కాగా మాడుగుల ప్రాంతంలోని దేవదాయ శాఖ భూముల్లో సుమారు 200 ఎకరాలను 2015-17 సంవత్సరాల్లో ప్రభుత్వం కొనుగోలు చేసింది. మరో వంద ఎకరాలను వేలం పాట ద్వారా రైతులు కౌలుకు తీసుకుని, ఏటా నిర్ణీత మొత్తం కౌలు చెల్లిస్తున్నారు. మిగిలిన 740 ఎకరాలు పరాధీనంలో వున్నట్టు దేవదాయ శాఖ అధికారులు గుర్తించారు. అన్యాక్రాంతమైన భూములను తిరిగి స్వాధీనం చేసుకునేందుకు అధికారులు చేసిన ప్రయత్నాలు, రాజకీయ ఒత్తిళ్ల కారణంగా ఫలప్రదం కాలేదు. ఈ నేపథ్యంలో 2014లో టీడీపీ అధికారంలో వున్నప్పుడు ఆలయాల భూములను గుర్తించిన రెవెన్యూ అధికారులు వాటికి 1-బి పత్రాలను జారీ చేశారు. ఈ భూములను వేలం పాట ద్వారా కౌలుకు ఇవ్వడానికి అధికారులు చర్యలు చేపట్టగా, అప్పటికే సాగు చేసుకుంటున్న రైతులు అడ్డుపడి, ఈ భూములు ఆలయాలకు చెందినవి కావని, తమకు వారసత్వంగా వచ్చిన ఆస్తులంటూ వాగ్వాదానికి దిగారు. దీంతో అధికారులు దేవదాయ శాఖ భూములను గుర్తించి బోర్డులు చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఆ పార్టీ నేతల అండదండలతో దేవదాయ భూముల ఆక్రమణదారులు తమ పేరున పట్టాదారు పాసుపుస్తకాలు ... మిగతా 8వ పేజీలో



దేవదాయ శాఖ భూమిలో అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

మహిళ హత్య కేసులో వీడిన మిస్టరీ

పేగు తెంచుకొని పుట్టిన బిడ్డలే అంతమొందించారు

- బాబాయితో కలిసి హత్య చేసిన ఇద్దరు కుమార్తెలు
- మృతదేహాన్ని బాటజంగాలపాలెం తీసుకెళ్లి పెట్రోల్ పోసి నిప్పటించిన బాబాయి
- ముగ్గురినీ అరెస్టు చేసిన పోలీసులు
- తల్లి ప్రవర్తనతో విసుగు చెంది కడతేర్చినట్టు విచారణలో వెల్లడి
- నిందితుల్లో ఒకరు మైనరు
- ఒడిశా నుంచి వలస వచ్చి కూర్మన్నపాలెంలో నివాసం

అనకాపల్లి రూరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): సబ్బవరం మండలం బాటజంగాలపాలెం వద్ద పక్షం రోజుల క్రితం జరిగిన గుర్తు తెలియని మహిళ హత్య కేసును పోలీసులు ఛేదించారు. తల్లి ప్రవర్తనతో విసుగుచెందిన కుమార్తెలు.. బాబాయ్‌తో కలిసి హత్య చేసినట్టు ఎస్పీ తుహిన్ సిన్హా వెల్లడించారు. ఇందుకు సంబంధించిన వివరాలను మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు.

ఒడిశా రాష్ట్రానికి చెందిన బంకెల సంతు(37)కు భర్తతో కొంతకాలం క్రితం స్పర్ధలు రావడంతో వేర్వేరుగా జీవనం సాగిస్తున్నారు. సంతు తన ఇద్దరు కుమార్తెలతో కలిసి కూర్మన్నపాలెంలోని రాజీవ్‌నగర్‌లో నివాసం ... మిగతా 8వ పేజీలో



మీడియా సమావేశంలో వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ తుహిన్‌సిన్హా.

జనసేన మెడికల్ కమిటీ సభ్యుడిగా జ్యోతికుమార్



ఎస్.రాయవరం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): విశాఖలో జరగనున్న సేనతో సేనాని రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశానికి ఏర్పాటు చేసిన మెడికల్ కమిటీ సభ్యుడిగా జనసేన మండల యూత్ ప్రెసిడెంట్ లింగంపల్లి జ్యోతికుమార్ నియమితులయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా పలువురు వైద్య నిపుణులు, నాయకులు, యువ నాయకులతో ఏర్పాటు చేసిన కమిటీలో తనను సభ్యుడిగా నియమించారన్నారు. ఈ కమిటీలో చోటు దక్కడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ అవకాశం కల్పించిన ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, జనసేన డాక్టర్ సెల్ చైర్మన్ డాక్టర్ బొడ్డేపల్లి రఘు, పాయకరావుపేట ఇన్‌చార్జి గెడ్డం బుజ్జిలకు జ్యోతికుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

'పేట'లో చవితి సందడి

పాయకరావుపేట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది వినాయక చవితిని ఘనంగా జరుపుకునేందుకు పట్టణ ప్రజలు సిద్ధమవడంతో మంగళవారం పాయకరావుపేటతోపాటు పక్కనే ఉన్న తూర్పుగోదావరి జిల్లా తుని మార్కెట్లు కొనుగోలుదారులతో కిక్కిరిశాయి. పట్టణంలో ఆలయాలతోపాటు పలు ముఖ్య కూడళ్లలో వినాయక నవరాత్రి ఉత్సవాలు నిర్వహించేందుకు చలువ పందిళ్లు వేసి పూల దండలు, విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరిస్తున్నారు. విగ్రహాలు కొనుగోలు చేసినవారు బాణసంచా కాల్చుతూ వాహనాలపై తరలిస్తుండడంతో పట్టణంలో చవితి సందడి నెలకొంది.

వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి

- మునిసిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి
- కొక్కిరాపల్లి వార్డును డీనోటిఫైడ్ చేయాలని కౌన్సిలర్ డిమాండ్
- చైర్‌పర్సన్ సమాధానంతో నిరసనగా మధ్యలో వెళ్లిన కౌన్సిలర్
- మునిసిపల్ ఆఫీస్ ఎదుట నిరాహార దీక్ష చేపట్టిన రామకృష్ణ

ఎలమంచిలి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మారుతున్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో మునిసిపాలిటీలో వ్యాధులు ప్రబలకుండా అధికార యంత్రాంగం ముందస్తు చర్యలు తీసుకోవాలని చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి ఆదేశించారు. మంగళవారం జరిగిన మునిసిపల్ కౌన్సిల్ సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఇప్పటికే వైరల్ జ్వరాలు వ్యాప్తి చెందాయని, డెంగ్యూ వంటి ప్రమాదకర వ్యాధులు ప్రజలపై దాడి చేయకుండానే తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి కౌన్సిలర్ 20 కుటుంబాలను దత్తత తీసుకుని, వారిలో అవగాహన కల్పించేలా ప్రత్యేక చొరవ చూపాలన్నారు. వైస్ చైర్మన్ ఆరెపు నాగ త్రినాథ మాట్లాడుతూ కౌన్సిల్ సమావేశాలకు సచివాలయ అడ్మిన్లు కూడా పాల్గొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. కొందరు సచివాలయ సిబ్బంది కౌన్సిలర్లను పట్టించుకోవడం లేదన్నారు. అనంతరం 23వ వార్డు కౌన్సిలర్ మజ్జి రామకృష్ణ మాట్లాడుతూ 23వ వార్డు డీ నోటిఫై చేయాలని కోరిన ప్రతిపాదన గురించి అడిగారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ కొక్కిరాపల్లి వార్డుకు సుమారు రెండున్నర కోట్ల రూపాయలు వరకూ అభివృద్ధి పనుల కోసం వెచ్చించడం జరిగిందన్నారు. అనంతరం కౌన్సిలర్ రామకృష్ణ కౌన్సిల్ హాలు నుంచి బయటకు వెళ్లిపోయి, మునిసిపల్ కార్యాలయం వద్ద నిరాహార దీక్షకు దిగారు. ఈ సమావేశంలో కమిషనర్ ప్రసాదరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు, ఏఈ గణపతి సుబ్బారావు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న పాలకవర్గ సభ్యులు. (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న రమాకుమారి

కొక్కిరాపల్లిని పంచాయతీగా చేయాలని కౌన్సిలర్ నిరాహార దీక్ష

- కమిషనర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు
- నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారని దీక్షా శిబిరం వద్ద బైటాయింపు
- మద్దతుగా తరలివచ్చిన టీడీపీ శ్రేణులు

ఎలమంచిలి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి మునిసిపాలిటీ నుంచి 23వ (కొక్కిరాపల్లి)వార్డును డీ నోటిఫైడ్ చేసి పంచాయతీగా మార్పు చేయాలని కోరుతూ 23వ వార్డు కౌన్సిలర్ (టీడీపీ) మజ్జి రామకృష్ణ మంగళవారం నుంచి నిరాహార దీక్ష చేపట్టారు. మంగళవారం ఉదయం మునిసిపల్ కార్యాలయ ఆవరణలో కౌన్సిల్ సమావేశం జరుగుతుండగా కౌన్సిలర్ రామకృష్ణ కౌన్సిల్ హాలు నుంచి బయటకు వెళ్లిపోయి నిరసనకు దిగారు. కొక్కిరాపల్లిని విలీనం చేయడంతో ఉపాధి హామీ పనులకు దూరమైపోయి వార్డులోని అధిక శాతం మంది ప్రజలకు పనులులేకుండా పోయాయని, వార్డు పూర్తి స్థాయిలో అభివృద్ధికి నోచుకోలేదని రామకృష్ణ అన్నారు. జీఆర్‌టీ నంబరు 1378 ఉత్తర్వులు ప్రకారం తమ వార్డును డీ నోటిఫై చేయాలని డిమాండ్ చేశారు. విషయాన్ని తెలుసుకున్న టీడీపీ శ్రేణులు, మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావులు రామకృష్ణ నిరాహార దీక్ష శిబిరానికి చేరుకున్నారు. అనంతరం పప్పల చలపతిరావు ఈ విషయమై మునిసిపల్ కమిషనర్‌తో మాట్లాడడానికి ఆయన చాంబర్‌కు వెళ్లారు. ఆ సమయంలో కమిషనర్ వీసీలో ఉండడంతో అర్థగంట సేపు వేచి ఉన్నారు. అనంతరం కమిషనర్‌ను కొక్కిరాపల్లి డీ నోటిఫై గురించి అడిగారు. కమిషనర్ సమాధానం సంతృప్తికరంగా లేకపోవడంతో చలపతిరావు అక్కడి నుంచి వచ్చి రామకృష్ణకు సంఘీభావం తెలుపుతూ నిరసన దీక్ష శిబిరం వద్ద కూర్చున్నారు. కమిషనర్ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారని, తన 30 ఏళ్ల రాజకీయ జీవితంలో ఇంతకు ముందెన్నడూ ఈ విధంగా బైటాయించిన సందర్భం లేదని మాజీ ఎమ్మెల్సీ చలపతిరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం తెలియడంతో పెద్ద సంఖ్యలో టీడీపీ శ్రేణులు, మహిళలు నిరాహార దీక్ష శిబిరానికి చేరుకుని మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు గొర్లె నానాజీ, ఆడారి ఆదిమూర్తి, జనసేన పట్టణ అధ్యక్షుడు బొద్దపు శ్రీను, నేతలు కొఠారు సాంబ, కరణం రవి, దంట్ల వెంకటస్వామి, వీరబాబు, సూరకాసుల రమణబాబు, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.



మునిసిపల్ కార్యాలయం వద్ద నిరాహార దీక్ష చేపట్టిన 23వ వార్డు కౌన్సిలర్ రామకృష్ణ. సంఘీభావం ప్రకటించిన మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, టీడీపీ, జనసేన నేతలు

చవితికి వరుణుడి దెబ్బ

- పూజా సామగ్రి కొనుగోలుకు సాయంత్రం వరకు రోడ్డెక్కని ప్రజలు

అచ్యుతాపురం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితికి వరుణుడి దెబ్బ తగిలింది. సోమవారం రాత్రి నుంచి నిరంతరాయంగా వర్షం కురుస్తుండడంతో ప్రజలు రోడ్డెక్కడానికి భయపడ్డారు. వినాయక చవితి సందర్భంగా వ్యాపారులు భారీ స్థాయిలో వినాయక ప్రతిమలు, పూలు, పత్రి తెచ్చారు. కాని వదలకుండా వర్షం పడడంతో కొనుగోలుదారులు రాలేదు. సాధారణంగా వినాయక చవితి ముందు రోజు అచ్యుతాపురం చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వినాయక ప్రతిమలు, పూలు, పండ్లు, పత్రి, పాలవెల్లి మొదలగు సామానులు కొనుగోలు చేస్తారు. దీంతో అచ్యుతాపురం జంక్షన్ వినాయక చవితికి ముందురోజు ఖాళీ ఉండేది కాదు. కానీ ఈసంవత్సరం పరిస్థితిలో మార్పు వచ్చింది. అచ్యుతాపురం జంక్షన్‌లో ఫ్లైఓవర్ నిర్మాణం పనులు జరుగుతుండడంతో రోడ్డంతా బురదమయమైంది. మంగళవారం సాయంత్రం నుంచి గొడుగులు వేసుకొని వచ్చి విగ్రహాలు కొనుగోలు చేశారు. కాగా స్థానిక క్రైట్స్ కాలేజీలో విద్యార్థులకు మట్టి వినాయక ప్రతిమలు మంగళవారం పంపిణీ చేశారు.

ఎలమంచిలిలో..

పట్టణంలో మంగళవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో జనజీవనానికి అంతరాయం ఏర్పడింది. అల్పపీడనం కారణంగా వర్షం కురవడంతో పలు చోట్ల రోడ్లన్నీ బురదమయంగా మారాయి. వీధులన్నీ చిత్తడి అయ్యాయి. వినాయక చవితి సందర్భంగా పూజా సామగ్రి కొనుగోలు చేసేందుకు కూడా వర్షం అవకాశం ఇవ్వలేదు. దీంతో మార్కెట్‌లో కొనుగోలు దారులు తక్కువగా వచ్చారు. చవితి వేడుకలకు పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లోనూ వినాయక మండపాలు సర్వం సిద్ధం చేశారు. ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



అచ్యుతాపురంలో గొడుగులు వేసుకొని మార్కెట్‌కు వచ్చిన ప్రజలు

పవన్ ఆలోచనా సరళి వినూత్నం

- స్వాతంత్ర్యం తరువాత పంచాయతీలకు ప్రత్యేక గుర్తింపు
- జనసేన నేత తోట నగేశ్

నక్కపల్లి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆలోచనా సరళి వినూత్నంగా వుందని, స్వాతంత్ర్యం వచ్చిన తరువాత పంచాయతీలకు ప్రత్యేక గుర్తింపు పవన్ ద్వారా లభించిందని జనసేన నాయకుడు, ఆ పార్టీ మీడియా కో-ఆర్డినేటర్ తోట నగేశ్ చెప్పారు. మంగళవారం నక్కపల్లి జనసేన పార్టీ కార్యాలయంలో స్థానిక విలేకర్లతో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పంచాయతీలను ప్రక్షాళన చేసి, ప్రత్యేక నిధులు ఇచ్చిన ఘనత డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కే దక్కిందన్నారు. ఈ నెల 28, 29, 30 తేదీల్లో విశాఖ కేంద్రంగా మూడు రోజుల పాటు సేనతో సేనాని కార్యక్రమం జరుగుతుందన్నారు. ఇది ఒక వినూత్నమైన కార్యక్రమమని, నాయకులెవరూ ఈ సమావేశాల్లో మాట్లాడరని, సాధారణ కార్యకర్తలతోనే తమ అధినేత పవన్ కల్యాణ్ మమేకమవుతారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆకేటి గోవిందరావు, కురందాసు అప్పలరాజు, పాము గణేశ్, యలమంచిలి చంద్రరావు, బంగారి రాజు, కోసూరి నాని, రాము, వెదుళ్ల ప్రసాద్, చిన్నలోవరాజు పాల్గొన్నారు.



విలేకర్లతో మాట్లాడుతున్న తోట నగేశ్

సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేయాలి

- మండల సమావేశంలో ఎంపీపీ గోవింద్

ఎలమంచిలి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా అధికారులు, ప్రజాప్రతినిధులు పనిచేయాలని ఎంపీపీ బోదెపు గోవింద్ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీపీ బోదెపు గోవింద్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూగ్రామాల్లో పరిశుభ్రకరమైన వాతావరణం ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. అర్హత ఉన్న వారికి ప్రభుత్వ పథకాలు అందడంలో జాప్యం లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం పలు శాఖల అధికారులు తమ అభివృద్ధి నివేదికలను సమావేశం ముందుంచారు. పులపర్తి గ్రామంలో ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతున్న విషయాన్ని గత సమావేశం ముందుంచినా సరే ఎటువంటి ఫలితం లేదని కోఆప్షన్ సభ్యుడు ఎస్. నూకేశ్వరరావు ప్రశ్నించారు. దీనికి ఎంపీపీ కల్పించుకుని స్థలం ఆక్రమణకు గురికాకుండా ఉండేలా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కేఎస్. కొండలరావు, డీటీ వినయ్‌కుమార్, వైస్ ఎంపీపీ రాజాన శేషు, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ బోదెపు గోవింద్

మట్టి గణపతి విగ్రహాలు పంపిణీ

పాయకరావుపేట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి సందర్భంగా పర్యావరణ పరిరక్షణలో భాగంగా కూటమి నాయకులు మంగళవారం ప్రజలకు మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. స్థానిక కంటోన్మెంట్ ఏరియాలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో టీడీపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు గొర్రెల రాజబాబు, జనసేన పార్టీ మహిళా నాయకురాలు నారపురెడ్డి పద్మ తదితరులు మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. అదేవిధంగా స్థానిక పార్కు సెంటర్‌లో జూరెడ్డి చిరంజీవి ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగతా శ్రీనివాస్, వికాస తరంగిణి సభ్యులు చిక్కాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరంలో..

మండల కేంద్రంలో మంగళవారం మట్టి వినాయక ప్రతిమలను మాజీ వైస్ ఎంపీపీ కొణతాల శ్రీనివాసరావు పంపిణీ చేశారు. విగ్రహాలతో పాటు వ్రతకల్ప పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ భూపతి అప్పారావు, కుర్రా కాశీ, భద్రరావు, పల్లా సింహాచలం, త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

మునగపాకలో..

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని రాష్ట్ర రహదారులు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. మునగపాకలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ మంగళవారం మట్టివినాయక విగ్రహాలు ఉచిత పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రగడ మాట్లాడుతూ వినాయక చవితి సంబరాలంటే యువకులకు ఎంతో ఇష్టపడతారని తెలిపారు. కర్రి సాయికృష్ణ మాట్లాడుతూ ఈ ఏడాది మునగపాకతో పాటు పలు గ్రామాల్లో సుమారు 4వేలు మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశామన్నారు. అదేవిధంగా వైసీసీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ మినరల్ వాటర్ ప్లాంట్ వద్ద విగ్రహాలను అందజేశారు. పాటిపల్లి, మంగళవరపుపేట గ్రామాల్లో మా ఊళ్లో గ్రంథాలయం ఆధ్వర్యంలో పంపిణీ జరిగింది. ఆయా కార్యక్రమాల్లో దాడి శివ, మళ్ల వరహానర్సింగరావు, ఆడారి గణపతి అచ్చింనాయుడు, బీశెట్టి ధనశ్రీను, యల్లపు సంజీవరావు, మళ్ల శేషు పాల్గొన్నారు.



మునగపాకలో మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేసిన ప్రగడ నాగేశ్వరరావు, కర్రి సాయికృష్ణ



మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న మాజీ ఎంపీపీ కొణతాల శ్రీనివాసరావు

'మురా కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి'

అచ్యుతాపురం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మురా కార్మికుల కోసం సమగ్రచట్టం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ శంకరరావు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఒక ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో జరిగిన అనకాపల్లి జిల్లా మురా కార్మిక సంఘం మహాసభలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం మురా కార్మికుల సమగ్ర చట్టం చేయాలన్నారు. మురాకార్మికులకు స్థానిక కర్మాగారాల్లో ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో లాలం నరసింహారావు, జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, కె. సోమునాయుడు, కర్రి అప్పారావు, కె. నానాజీ, కర్ణం వెంకటరావు, కనకాల అప్పలరావు, సీహెచ్ రామకృష్ణ పాల్గొన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ హైమావతి

పాయకరావుపేట రూరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ప్రసవాలు ప్రభుత్వం ఆసుపత్రులలో జరిగేలా చూడాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ హైమావతి సూచించారు. మండలంలోని మంగవరం, శ్రీరాంపురం పీహెచ్‌సీలను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డెలివరీ గదిని, ల్యాబ్‌ను తనిఖీ చేశారు. గర్భిణులను ప్రతి నెలా క్రమం తప్పకుండా పరీక్షించాలన్నారు. మండలంలోని రాజానగరం గ్రామానికి చెందిన చేపల రాము తల్లి రెండు నెలలుగా అరుదైన వ్యాధితో బాధపడుతున్నారు. ఆమె వైద్యానికి ఇప్పటికే లక్షలాది రూపాయలు ఖర్చు చేసినా ఉపయోగం లేకపోయింది. ఈ విషయమై హోం మంత్రి అనిత దృష్టికి తీసుకెళ్లగా ఆమె స్పందించి డీఎంహెచ్‌వోతో మాట్లాడారు. దీంతో మంగళవారండీఎంహెచ్‌ఓ హైమావతి బాధిత బంధువులను శ్రీరాంపురం పీహెచ్‌సీకి పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. రోగిని ఇంటి వద్ద పెట్టుకోవద్దని తెలిపారు. వైద్యం నిమిత్తం తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. తరువాత ఆ పేషెంట్‌ను మెరుగైన వైద్యానికి ఎక్కడకు పంపాలో నిర్ణయిస్తామన్నారు. కార్యక్రమంలో శ్రీరాంపురం, మంగవరం పీహెచ్‌సీల వైద్యాధికారులు సంకీర్తన, పి. కావ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



శ్రీరాంపురం పీహెచ్‌సీలో బాలింతలతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో హైమావతి

వరి సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి

రాంబిల్లి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్ వరి సాగులో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయాధికారిణి సి.సుమంత అన్నారు. మంగళవారం ఆమె మండలంలోని దిమిలి, పంచదార్ల గ్రామాల్లో రైతులతో కలిసి పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులు 33 కుదుళ్లు వచ్చే విధంగా వరి నాట్లు వేసుకోవాలన్నారు.

వినాయక ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

రాంబిల్లి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వినాయక ఉత్సవాలను మండల ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని రాంబిల్లి ఎస్‌ఐ నాగేంద్ర మంగళవారం తెలిపారు. వినాయక మండపాల్లో గాని, విగ్రహ నిమజ్జనం ఊరేగింపుల్లో గాని, డీజే సౌండ్ సిస్టం వాడుకోవడానికి ఎటువంటి అనుమతులు ఇవ్వలేదన్నారు. అందరు నిర్వాహకులు, భక్తులు పోలీస్‌వారి నియమాలను కచ్చితంగా పాటించాలన్నారు. గణేష్ మండపాల వద్ద అల్లర్లు, గొడవలు చోటుచేసుకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఘనంగా చెవిటి నూకాలమ్మ జాతర



భక్తులతో కిటకిటలాడుతున్న చెవిటి నూకాలమ్మ ఆలయం

ఎస్.రాయవరం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడివాడ పంచాయతీ కొత్తపోలవరంలో మంగళవారం చెవిటి నూకాలమ్మ జాతరను గ్రామస్థులు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి గ్రామస్థులు, పరిసర గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చి అమ్మవారికి పసుపు కుంకుమలతో ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు ఎన్. వెంకటరాజు, పలువురు టీడీపీ నాయకులు దర్శించుకున్నారు. మహిళలు ఘటాలను ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు.

ఐద్వా మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

ఎలమంచిలి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 31వ తేదీన కశింకోటలో నిర్వహించే ఐద్వా 5వ మహాసభలను విజయవంతం చేయాలని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి డి. వరలక్ష్మి కోరారు. మంగళవారం ఎలమంచిలిలో ఆమె పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐద్వా మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రతినిధులు నాగమణి, పి. వెంకటలక్ష్మి, నూకరత్నం తదితరులు పాల్గొన్నారు.

'తీరంలో ఇసుక తవ్వకాలు జరిపితే చర్యలు'

రాంబిల్లి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తీరం వెంబడి ఇసుక తవ్వకాలు చేపడితే చర్యలు తప్పవని తహశీల్దార్ శ్రీనివాసరావు హెచ్చరించారు. మం గళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వాడనర్సాపురం, లోవపాలెం, కొత్తపట్నం, సీతపాలెం సమీపంలోని తీరం వెంబడి ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు చేస్తున్నారన్నారు. అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు చేపట్టేవారు ఎంతటి వారైనా సరే ఊరుకొనేది లేదని శ్రీనివాసరావు తెలిపారు.

రైతు సేవా కేంద్రాల తనిఖీ

నక్కపల్లి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడిచెర్ల, చినదొడ్డిగల్లుల్లో రైతు సేవా కేంద్రాలను మంగళవారం తహశీల్దార్ నర్సింహమూర్తి, ఎంపీడీవో డీ సీతారామరాజు, ఏవో ఉమా ప్రసాద్ తనిఖీ చేశారు. రైతులకు ఎరువుల సరఫరా జరుగుతున్న తీరును పరిశీలించారు. సక్రమంగా యూరియా పంపిణీ చేయాలని నిర్వాహకులను ఆదేశించారు.అనంతరం ఈ గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఈ తనిఖిల్లో డిప్యూటీ ఎంపీడీవో చలపతిరావు పాల్గొన్నారు.

ఐదుగురి పేకాట రాయుళ్లు అరెస్టు

ఎస్.రాయవరం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొరుప్రోలు గ్రామ శివారులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై దాడి చేసి ఐదుగురిని అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ విభీషణరావు మంగళవారం తెలిపారు. వారి వద్ద నుంచి రూ.6,400 నగదును స్వాధీనం చేసుకున్నట్టు ఆయన చెప్పారు. అందిన సమాచారం మేరకు దాడి చేయడం జరిగిందన్నారు. పట్టుపడ్డ ఐదుగురిపై కేసు నమోదు చేసి, నగదును సీజ్ చేశామన్నారు.

సాధారణం కంటే అధికంగా కురిసిన వర్షం

మునగపాక, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఆగస్టు నెలలో సాధారణ వర్షపాతం కంటే అధికంగా వర్షం కురిసింది. మండలంలో సోమవారం ఉదయం 8.30 గంటల నుంచి మంగళవారం ఉదయం 8.30 వరకు 44.4 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంట వరకు 35.2 మిల్లీమీటర్లు నమోదైనట్టు ఏఎస్‌వో చంద్రమౌళి తెలిపారు. ఈనెల 17, 18 తేదీలలో 109.2 మిల్లీమీటర్లు పడింది. ఆగస్టు నెలలో సాధారణ వర్షపాతం 163.4 మిల్లీమీటర్లు కాగా ఇప్పటివరకు 178.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

మార్కెట్‌కు చవితి శోభ

అనకాపల్లి పట్టణంలో సందడి
కిటకిటలాడిన దుకాణాలు
వర్షంతో కొనుగోలుదారులు, వ్యాపారుల ఇబ్బందులు


నెహ్రూచౌక్‌లో కిక్కిరిసిపోయిన దుకాణాలు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో మార్కెట్‌కు చవితి కళ ఉట్టిపడింది. అనకాపల్లి పట్టణంలో మంగళవారం వినాయక చవితి శోభ సంతరించుకుంది. వివిధ దుకాణాల్లో రద్దీ కనిపించింది. అయితే అల్పపీడనం కారణంగా తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండడంతో వినాయక చవితి పూజా సామగ్రి అమ్మకాలు చేసేవారు, సామగ్రి కొనుగోలు చేయడానికి వచ్చిన ప్రజలు ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం నాలుగు గంటల సమయంలో వర్షం జోరు తగ్గడంతో ఎక్కువ మంది రోడ్డుపైకి వచ్చారు. నెహ్రూచౌక్, చిన నాలుగురోడ్ల జంక్షన్, పెరుగుబజార్ జంక్షన్ ప్రాంతాలు కొనుగోలుదారులతో సందడిగా మారాయి. ఉదయం నుంచి భారీ వర్షం కురవడంతో ఇక అమ్మకాలు జరగవని భావించిన వ్యాపారులు డీలా పడినప్పటికీ, సాయంత్రం వర్షం తగ్గడంతో ఊపిరి పీల్చుకున్నారు. అయితే పూజా సామగ్రి ధరలు ఆకాశాన్నంటాయని కొనుగోలుదారులు చెబుతున్నారు. హోల్‌సేల్ మార్కెట్‌లోనే కొబ్బరికాయ ఒకటి రూ.35కు పలుకగా, రిటైల్‌లో సైజును బట్టి రూ.40 నుంచి రూ.45 వరకు అమ్మకాలు సాగించారు. పూల ధరలకు బాగా డిమాండ్ పెరిగింది. పూజకు అవసరమయ్యే బంతి, చామంతి పూల ధరలు గత వారం రోజులు కంటే ప్రస్తుతం పెరిగాయని, దీనికి కారణం వర్షాలేనని వర్తకులు చెబుతున్నారు. అయితే వినాయక ప్రతిమలు అమ్మకాలు కూడా అంతంత మాత్రంగానే జరిగాయి. సాయంత్రం నాలుగు గంటల నుంచి పొద్దుపోయే వరకు కొనుగోలుదారులతో పట్టణం సందడిగా కనిపించింది.

సబ్బవరంలో...

సబ్బవరం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పురస్కరించుకుని సబ్బవరం ప్రధాన కూడలిలోని మార్కెట్ కళకళలాడింది. చవిత పూజా సామగ్రి కోసం మార్కెట్‌కు భక్తులు భారీగా తరలివచ్చారు. ఉదయం నుంచి రాత్రి వరకూ మార్కెట్ కొనుగోలుదారులతో కిక్కిరిసిపోయింది. మంగళవారం ఉదయం నుంచి వర్షం కురుస్తుండడంతో వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అయినప్పటికీ భక్తులు తరలివచ్చి పూజా సామగ్రి కొనుగోలు చేశారని వ్యాపారులు చెబుతున్నారు. కాగా గత ఏడాది కంటే ఈ ఏడాది పది నుంచి 15 శాతం ధరలు పెరిగినట్టు కొనుగోలుదారులు తెలిపారు.



సబ్బవరం మార్కెట్‌లో పూజా సామగ్రి కొనుగోలు చేస్తున్న భక్తులు

అనకాపల్లిలో భారీ వర్షం

లోతట్టు ప్రాంతాలు జలమయం
చెరువును తలపించిన కాంప్లెక్స్ ఆవరణ
తడిలోనే తహసీల్దార్ కార్యాలయ ఉద్యోగుల విధులు


అనకాపల్లి పట్టణంలో వర్షం

అనకాపల్లి టౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన అనకాపల్లిలో మంగళవారం భారీ వర్షం కురిసింది. వేకువజాము నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు ఎక్కడతెరిపి లేకుండా వాన పడడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. జనజీవనం స్తంభించిపోయింది. ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణ చెరువును తలపించింది. దీంతో ప్రయాణికులు, డిపోలోకి వెళ్లే ఉద్యోగులు ఇబ్బందులు పడ్డారు. అలాగే ప్రధాన రహదారులపై వర్షం నీరు ఏరులై పారింది. దీంతో ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించే ప్రజలకు ఇబ్బందులు తప్పలేదు. విజయరామరాజుపేట అండర్ బ్రిడ్జి కింద నీరు నిలిచిపోవడంతో వాహన చోదకులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అలాగే తహశీల్దార్ కార్యాలయం పూర్తిగా కారిపోయింది. గదుల్లో వర్షపు నీరు ఎక్కువగా చేరింది. అయిన్పటికీ గత్యంతరం లేకపోవడంతో ఉద్యోగులు, సిబ్బంది వర్షం నీరులోనే విధులు నిర్వహించారు. కంప్యూటర్లకు సంబంధించిన వైర్లు నేలకు ఉండడంతో ఎక్కడ విద్యుత్ షాక్‌కు గురవుతామోనని మహిళా అధికారులు ఆందోళనతో విధులు చేపట్టారు.


ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో చెరువును తలపిస్తున్న వాన నీరు


తహసీల్దార్ కార్యాలయంలోకి వచ్చిన వర్షం నీరు

పరవాడలో...

పరవాడ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం భారీ వర్షం కురిసింది. ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రహదారులపై నీరు పారింది. పరవాడ పెద్ద చెరువు, పైడంబంధం చెరువులోకి వర్షపు నీరు సమృద్ధిగా చేరింది. వర్షం కారణంగా వినియోగదారులు రాకపోవడంతో పరవాడలో వారపు సంత మంగళవారపు వెలవెలబోయింది.

లంకెలపాలెంలో...

లంకెలపాలెం: లంకెలపాలెం పరిసర ప్రాంతాల్లో మంగళవారం భారీ వర్షం కురిసింది. తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా వర్షం పడంతో నివాసితులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రధాన గెడ్డలు వాన నీటితోపొంగి ప్రవహించాయి. కార్మికులు, రోజూ వారీ కూలీలు ఇళ్లకే పరిమితమయ్యారు.

బార్‌లకు దరఖాస్తు గడువు పెంపు

అనకాపల్లి కలెక్టరేట్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బార్ అండ్ రెస్టారెంట్లకు దరఖాస్తు గడువును పెంచినట్టు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి వి.సుధీర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు రూ.5 లక్షలు నాన్ రిఫండ్‌బుల్ దరఖాస్తు రుసుం, రూ.10 వేల ప్రొసెసింగ్ ఫీజు చెల్లించి నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆఫ్‌లైన్ లేదా హైబ్రిడ్ విధానం ద్వారా డిస్ట్రిక్ట్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఆఫీసర్ అనకాపల్లి కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలన్నారు. కలెక్టర్ కార్యాలయంలోని ఈ నెల 30వ తేదీ ఉదయం ఎనిమిది గంటలకు బార్ల కేటాయింపు కోసం డ్రా తీయనున్నట్టు చెప్పారు.

మట్టి గణపతి ప్రతిమల పంపిణీ


ఉద్యోగులకు మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న జేసీ జాహ్నవి

అనకాపల్లి కలెక్టరేట్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పండుగ పురస్కరించుకొని కలెక్టరేట్‌లో మంగళవారం జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి అధికారులు, ఉద్యోగులకు మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం మట్టితో తయారు చేసిన వినాయక ప్రతిమలను కాలుష్య నియంత్రణ మండలి ఉచితంగా పంపిణీ చేస్తున్నదన్నారు. పర్యావరణ సమతుల్యత కోసం మట్టి ప్రతిమలను ప్రతిష్ఠించాలన్నారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి ఈఈ ముకుందరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అనకాపల్లి పట్టణంలో...


మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న రాంకీ

అనకాపల్లి టౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పరమేశ్వరి పార్కు జంక్షన్‌లో మట్టి వినాయక ప్రతిమలను జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బీమరశెట్టి రామకృష్ణ (రాంకీ) మంగళవారం పంపిణీ చేశారు. జనసేన నేత కాండ్రేగుల జోగేంద్ర ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాంకీ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బుద్ద శ్రీనివాసరావు, పీవీ జగన్మోహనరావు, పి.చందు పాల్గొన్నారు. అలాగే డైట్ ఇంజినీరింగ్ కళాశాలలో సిబ్బందికి, విద్యార్థులకు కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆర్.వైకుంఠరావు, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు. లక్ష్మీదేవిపేటలో పీలా రాజారావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. మేనేజింగ్ ట్రస్ట్ పీలా తులసీరామ్ పాల్గొన్నారు.

జూనియర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో...

కొత్తూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద వినాయక ప్రతిమల మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో జాయింట్ సబ్ రిజిస్ట్రార్ సిహెచ్.శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రజలు వినాయక చవితి వేడుకలను పర్యావరణ పరిరక్షణ చర్యలతో జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది ఎం.రవికుమార్, సి.హెచ్.శ్రీనివాసరావు, లోకేశ్, రమణ, అర్జున్, నాయుడు, దేవి పాల్గొన్నారు.

పరవాడ: స్థానిక రాజరాజేశ్వరి ఆలయం వద్ద రాంకీ డీజీఎం గిరిధరరావుభక్తి మంగళవారం మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేశారు. మట్టి వినాయక ప్రతిమలను పూజించి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. కార్యక్రమంలో రాంకీ ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ డాక్టర్ కె.శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

సబ్బవరం: మండల కేంద్రంలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద మంగళవారం మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. గత 20 ఏళ్లుగా పర్యావరణ హితం కోరుతూ మట్టి ప్రతిమలను పంపిణీ చేస్తున్నామని ఈ సందర్భంగా రావలమ్మపాలెంకు చెందిన గొంప ముత్యాలనాయుడు చెప్పారు. అలాగే గుల్లేపల్లిలో అక్షర పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ 1116 మట్టి ప్రతిమలను ఎంపీపీ బోకం సూర్యకుమారి చేతులు మీదగా భక్తులకు అందజేశారు.

53 మంది యువకుల రక్తదానం

కశింకోట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ జన్మదినోత్సవం పురస్కరించుకొని ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో సుమారు 53 మంది యువకులు పాల్గొని రక్తదానం చేశారు. అందరూ స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని, తద్వారా మరొకరికి ప్రాత దాత కావాలని ఈ సందర్భంగా నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం ధర్మశ్రీ, జడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, నాయకులు వైసీపీ నాయకులు నీటిపల్లి దివాకర్, మళ్ల బుల్లిబాబు, మలసాల కిశోర్, కలగ గున్నయ్యనాయుడు, గొల్లవిల్లి శ్రీను పాల్గొన్నారు.

వసతిగృహాలను పరిశుభ్రంగా ఉంచండి

జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్


కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, ఆగస్టు 26 (ఆంధ్ర జ్యోతి): ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాల్లో పరిశుభ్రత, భద్రతా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులకు ఆదేశించారు. జిల్లాలో సాంఘిక సంక్షేమ, వెనుకబడిన తరగతుల, ట్రైబల్ వెల్ఫేర్ అధికారులతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆహారం కలుషితం కాకుండా వార్డెన్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. అశ్రద్ధ వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వంట గదులు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, శిథిల భవనాలు గుర్తించి విద్యార్థులను సురక్షిత ప్రాంతాల్లో ఉంచాలని ఆమె సూచించారు. అలాగే వర్షాలు పడుతున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు రాకుండా చూడాలని చెప్పారు.

ఈవీఎం గోదాములు సందర్శించిన డీఆర్వో

అనకాపల్లి కలెక్టరేట్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ కార్యాలయ ప్రాంగణంలో భద్రపరిచిన ఈవీఎం గోదాములను రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి డీఆర్వో వై.సత్యనారాయణరావు మంగళవారం పరిశీలించారు. ఇక్కడ అమర్చిన సీసీ కెమెరాల పనితీరు, ప్రధాన ద్వారానికి ఉన్న సీళ్లను పరిశీలించారు. భద్రత ప్రమాణాలు, లాగ్ బుక్ నిర్వహణ, ఇతర అంశాలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈవీఎంలు భద్రపరిచిన గోదాము వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా డీఆర్వో సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్నికల విభాగం పర్యవేక్షకులు ఎస్‌వీఎస్ నాయుడు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

వరి సాగులో నారుమడి యాజమాన్యం కీలకం

జిల్లా వ్యవసాయ శాఖాధికారి మోహనరావు

కశింకోట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వరి సాగులో నారుమడి యాజమాన్యం చాలా కీలకమని జిల్లా వ్యవసాయ శాఖాధికారి బి.మోహనరావు చెప్పారు. మంగళవారం కశింకోట, వెదురుపర్తి గ్రామాల్లో వరి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉడుపుల సమయంలో చిగుళ్లు చించితే పంటకు మేలు జరుగుతుందన్నారు. యూరియాకు బదులు ఎకరాకు పొటాష్ 15 కిలోలు లేదా డీఏపీ 25 కిలోలు ఉపయోగించుకోవచ్చన్నారు. ఏవో స్వప్న పాల్గొన్నారు.

డీఐజీని కలిసిన రత్నాకర్


డీఐజీకి మట్టి వినాయక ప్రతిమ అందిస్తున్న రత్నాకర్

అనకాపల్లి టౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి పర్యటనలో భాగంగా మంగళవారం మహిళా పోలీస్ స్టేషన్‌కు వచ్చిన విశాఖ రేంజ్ డీఐజీ గోపినాథ్ జెట్టిని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ మర్యాదపూర్వకంగా కలిశారు. అనకాపల్లిలో గణనాథుని విగ్రహ ఏర్పాట్లపై చర్చించారు. అనకాపల్లి జిల్లాలోని వినాయక మండపాల్లో చవితి ఉత్సవాలు విజయవంతంగా సాగేలా చర్యలు తీసుకోవాలని రత్నాకర్ కోరారు. ఇందులోభాగంగా డీఐజీకి మట్టి వినాయక ప్రతిమ, వ్రతకల్ప పుస్తకాన్ని రత్నాకర్ అందజేశారు.

డిజిటల్ లక్ష్మి శిక్షకులకు బయోమెట్రిక్ డివైజ్‌లు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ జోనల్ కార్యాలయంలో డిజిటల్ లక్ష్మీ పథకానికి సంబంధించి శిక్షణ పొందిన మహిళలకు కమిషనర్ చక్రవర్తి మంగళవారం బయోమెట్రిక్ డివైజ్‌లను అందజేశారు. స్వయం సహాయక సంఘాల మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం రూపొందించిన ఈ కార్యక్రమంలో సమాఖ్యకు ఒకరి చొప్పున ఎన్నుకొని శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ పొందిన డిజిటల్ లక్ష్మీలకు కమిషనర్ డివైజ్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ వై.సంతోష్‌కుమార్, ఆర్వో రమణ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీలు పక్కాగా నిర్వహించాలి: ఎంపీపీ

సబ్బవరం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): సామాజిక తనిఖీలు పక్కాగా జరగాలని ఎంపీపీ బి.సూర్యకుమారి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సామాజిక తనిఖీల సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. హౌసింగ్, అటవీ శాఖ, సర్వశిక్ష అభియాన్, పంచాయతీరాజ్, ఇంజనీరింగ్ పనులను తనిఖీలు చేయాలన్నారు. ఎంపీడీవో నారాయణరావు, ఏపీవో వసంతకుమార్, ఈవోపీఆర్డీ చైతన్య, హౌసింగ్ ఏఈ ఎంఎస్ఎస్ఎన్.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గణేశ్ నిమజ్జనానికి ఏర్పాట్లు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): చవితి సందర్భంగా బుధవారం సాయంత్రం వినాయక ప్రతిమల నిమజ్జనానికి శారదానది వద్ద ఏర్పాట్లు చేశారు. నది ఘాట్ వద్దకు వచ్చే భక్తులు ఇబ్బందులు పడకుండా జడ్సీ చక్రవర్తి ఆధ్వర్యంలో సిబ్బంది చర్యలు చేపట్టారు. ఇప్పటికే శారదా నది మెట్ల ముందు లోతు లేకుండా మట్టితో సరి చేశారు. భక్తులు నది లోపలకు వెళ్లకుండా భారికేడ్లు ఏర్పాటు చేశారు. అలాగే ఘాట్ వద్ద జీవీఎంసీ వాహనాలను సిద్ధం చేస్తున్నారు. ప్రమాదాలు జరగకుండా గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు. అలాగే పట్టణ సీఐ టీవీ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు.


అరకులో వినాయక విగ్రహాల విక్రయం


పాడేరు మార్కెట్‌లో పూజలు, పత్రి దుకాణాల వద్ద కొనుగోలుదారులు

మార్కెట్‌లో వినాయక చవితి సందడి

- పాడేరులో కిటకిటలాడిన దుకాణాలు
- విగ్రహాలు, పూజా సామగ్రి కొనుగోలు

పాడేరురూరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పురస్కరించుకుని మంగళవారం స్థానిక మార్కెట్ కిటకిటలాడింది. బుధవారం చవితి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రధాన మార్కెట్ కొనుగోలుదారులతో రద్దీ నెలకొంది. అల్పపీడనం ప్రభావంతో గత మూడు రోజులుగా ఎడతెరిపి లేని వర్షాలు కురుస్తున్నప్పటికి పాడేరు డివిజన్ పరిధిలోని పాడేరు, హుకుంపేట, జి.మాడుగుల, పెదబయలు, ముంచంగిపుట్టు మండలాలకు చెందిన వివిధ గ్రామాల ప్రజలు వినాయ విగ్రహాలు, మండపాల అలంకరణ, పూజా సామగ్రి కొనుగోలుకు మంగళవారం ఉదయం 10 గంటలకే పట్టణానికి చేరుకున్నారు. కొనుగోలు చేసిన భారీ విగ్రహాలను ప్రైవేటు వాహనాల్లో గ్రామాలకు తరలించారు. పట్టణంలోని సుండ్రుపుట్టు, నక్కలపుట్టు గ్రామాల్లో ఏర్పాటు చేసే విగ్రహాలను ఉత్సవ కమిటీ ప్రతినిధులు మండపాల్లో అలంకరణలు పూర్తి చేసుకుని విగ్రహాలను సిద్ధం చేశారు. అదే విధంగా గృహాల్లో చవితి వేడుకలను చేపట్టే గృహిణులు, భక్తులు వినాయక విగ్రహాలు, పూజా సామగ్రిని కొనుగోలు చేశారు. అయితే, పూజ సామగ్రి ధరలకు రెక్కలు వచ్చాయి. సాధారణ రోజుల్లో రూ. 25 పలికే కొబ్బరికాయను మంగళవారం రూ. 30 నుంచి రూ. 35కు అమ్మకాలు చేపట్టారు. అదే విధంగా పూలు, పండ్లు, పత్రి తదితర పూజా సామగ్రిని వ్యాపారులు అధిక ధరలకు విక్రయించారు. అయినా, కొనుగోలుదారులు ఎక్కడా వెనకాడలేదు.


పాడేరులో గ్రామాలకు తరలిస్తున్న వినాయక విగ్రహం

అరకులోయలో..

అరకులోయ: పట్టణంలో వినాయక చవితి సందడితో కళకళలాడింది. ఇప్పటికే యువత వీధుల్లో ప్రత్యేకంగా వినాయక మండపాలు ఏర్పాటు చేశారు. బుధవారం విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వర్షాలు కురుస్తుండడంతో మండపాల్లో వర్షం నీరు చేరకుండా టార్పాలిన్‌లతో రూఫ్‌వేసి జాగ్రత్తలు తీసుకున్నారు. బుధవారం వినాయక చవితి సందర్భంగా ఇంట్లో పూజలు నిర్వహించుకునేందుకు భక్తులు వినాయక ప్రతిమలు, పూజాసామగ్రిని కొనుగోలు చేసేందుకు పెద్ద ఎత్తున పట్టణానికి వచ్చారు. దీంతో దుకాణాలు కిటకిటలాడాయి. పలు రహదారులపై వాహనాలు రద్దీ నెలకొంది.


అరకులోయలో ఉత్సవాల నేపథ్యంలో విద్యుత్‌దీపాల వెలుగులు

19 మందికి గురుకులాల్లో ప్రవేశం

- టీడీపీ అరకు ఇన్‌చార్జి దొన్నుదొర చొరవతో కార్యదర్శి ఉత్తర్వులు

అరకులోయ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అరకు నియోజకవర్గ ఇన్‌చార్జి, విజయనగరం జోన్ ఆర్టీసీ చైర్మన్ దొన్నుదొర చొరవతో పాడేరు ఐటీడీఏ పరిధిలోని గురుకులాల్లో ప లువురు విద్యార్థులకు ప్రవేశాలు లభించాయి. ఈ ఏడాది పాఠశాలలు పరిమితంగా ఉండటంతో అత్యధికశాతం మంది విద్యార్థులకు సీట్లు దక్కలేదు. ఈ నేపథ్యంలో గురుకులాల సెక్రటరీ ఎం. గౌతమితో దొన్నుదొర మాట్లాడారు. కొంత మందికి బాలబాలికలకు సీట్లు మంజూరు చేయాలని లిఖితపూర్వకంగా కోరారు. పరిశీలించిన గురుకుల కార్యదర్శి అరకులోయ, పాడేరు గురుకుల బాలికల ఆశ్రమోన్నత పాఠశాల, తుమ్మానువలస గురుకుల బాలుర ఆశ్రమోన్నత పాఠశాలల్లో 5, 6, 7 తరగతుల్లో 19 మంది బాల, బాలికలకు సీట్లు ఈ నెల 20న కేటాయించారు. ఈ మేరకు మంజూరు చేస్తున్న ఉత్తర్వులను సం బంధిత పాఠశాలలు, పాడేరు ఐటీడీఏ గురుకుల సెల్ కన్వీనర్‌కు దొన్నుదొరకు పం పారు. తమ అభ్యర్థనపై స్పందించి గురుకుల కార్యదర్శి ఎం.గౌతమికి దొన్నుదొర ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

డీఎస్సీలో అర్హత సాధించిన అభ్యర్థిని అనారోగ్యంతో మృతి


మృతి చెందిన నాగజ్యోతి (ఫైల్)

జి.మాడుగుల, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మండలానికి చెందిన డీఎస్సీకి ఎంపికైన గిరిజనరాలు మత్స్యరాస నాగజ్యోతి అనారోగ్యానికి గురై మంగళవారం ఉదయం విశాఖపట్నం కేజీహెచ్‌లో మృతి చెందారు. బంధువుల కథనం మేరకు.. జి.మాడుగుల మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ దివంగత మత్స్యరాస మత్స్యరాజు కుమార్తె నాగజ్యోతి ప్రభుత్వం నిర్వహించిన మెగా డీఎస్సీ 2025లో అర్హత సాధించారు. గతంలో ఆమె కాంట్రాక్టు పద్ధతిలో ఓ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహించారు. అప్పటిలోనే ఆమె బోన్ క్యాన్సర్‌కు గురై వైద్య సేవలు పొంది కొద్దిగా కోలుకున్నారు. ఇటీవల మళ్లీ ఆ వ్యాధి బారినపడటంతో కుటుంబ సభ్యులు ఆమెను విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ వైద్య సేవలు పొందుతూ ఆమె మంగళవారం మృతి చెందారు. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్నదే లక్ష్యం ఎంతో శ్రమించి డీఎస్సీలో అర్హత సాధించారు. అయితే, ఆమె విధుల్లో చేరక ముందే మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

ఉపాధ్యాయులకు సన్మానం


బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

చింతపల్లి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): చౌడుపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థుల విద్యా ప్రగతికి పూర్వ ఉపాధ్యాయుల కృషి అభినందనీయమని స్థానిక గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులు నమ్మి సూర్యనారాయణ అన్నారు. మంగళవారం పాఠశాల నుంచి బదిలీపై ఇతర పాఠశాలలకు వెళ్లిన ఉపాధ్యాయులకు ఎ. రాజ్‌కుమార్ అధ్యక్షతన సన్మాన సభను ఏర్పాటు చేశారు. తొలుత బదిలీపై వెళ్లి ఉపాధ్యాయులను సహోపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సూర్యనారాయణ మాట్లాడుతూ పాఠశాలను ఎంపీయూపీ నుంచి ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్‌కు పూర్వ ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకున్నారన్నారు. బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు కుడుమలు కాంతారావు, కిముడు దామోదర్, గుడివాడ శ్రీనివాస్, రోబ్బ వెంకట రమణమ్మ, ఎల్ఎఫ్ఎల్ హె చ్ఎం సరమండ బాల గంగాధర్ తిలక్, పాఠశాల చైర్మన్ కొర్ర మధు, హిమజ పాల్గొన్నారు.

కొమ్మంగి పెసా గ్రామ సభ ఎన్నిక వాయిదా

చింతపల్లి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొమ్మంగి గ్రామ సభ పెసా ఎన్నిక వాయిదా పడింది. మంగళవారం ప్రిసైడింగ్ అధికారి బీఎస్ఎన్ పడాల్ గ్రామ సచివాలయంలో ఎన్నికల కోసం నామినేషన్లను ఆహ్వానించారు. దీంతో మర్రి వెంకటరావు, జర్తా రాము ఉపాధ్యక్షుడు, కార్యదర్శిగా నామినేషన్లు దాఖలు చేశారు. అయితే, ఉపాధ్యక్షుడు, కార్యదర్శి ఎన్నికపై రెండు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. సుమారు మూడు గంటలపాటు ఇరువర్గాల మధ్య గొడవలతో ఎన్నిక జరగలేదు. పోలీసు జోక్యంతో ఎన్నిక నిర్వాహణకు ప్రిసైడింగ్ అధికారి మరోసారి ఏర్పాటు చేశారు. అయితే కోరం సరిపోక ఎన్నికను వాయిదా వేస్తున్నట్టు ప్రిసైడింగ్ అధికారి ప్రకటించారు.

చోడవరం ఎమ్మెల్యే రాజుకు సత్కారం


ఎమ్మెల్యే కేఎస్ఎన్.రాజుకు సత్కరిస్తున్న శ్రావణ్‌కుమార్, గిడ్డి ఈశ్వరి, తదితరులు

పాడేరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్.రాజును టీడీపీ నేతలు మంగళవారం పాడేరులో ఘనంగా సత్కరించారు. ఇక్కడికి వచ్చిన ఆయనను తెలుగుదేశం పార్టీ అరకులోయ పార్లమెంటరీ అధ్యక్షుడు, జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్, టీడీపీ నియోజకవర్గం ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, జీసీసీ డైరెక్టర్ బొర్రా నాగరాజు తదితరులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ డప్పోడి వెంకటరమణ, ఎంపీపీ రత్నకుమారి, మాజీ ఎంపీపీ బొర్రా విజయరాణి, టీడీపీ సీనియర్ నేతలు బాకూరు వెంకటరమణ, అల్లంగి సబ్బులక్ష్మి, జి.శాంతికుమారి, డి.కుమారి, తదితరులు పాల్గొన్నారు.

తెరచుకోని పైనంపాడు సచివాలయం

- అందని సేవలు.. గిరిజనుల ఇబ్బందులు


మంగళవారం మూతపడిన సచివాలయం

అనంతగిరి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పైనంపాడు పంచాయతీ కేంద్రంలోని సచివాలయం మంగళవారం తెరచుకోలేదు. దీంతో సేవల కోసం వచ్చిన గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.వేంగడ, పైనంపాడు రెండు పంచాయతీలకు కలిపి పైనంపాడులో సచివాలయం ఉంది. అయితే మంగళవారం తెరచుకోకపోవడంపై ఫొటో తీసి, వేంగడ అల్లూరి సమాచారం పేరిట ఉన్న వాట్సా గ్రూపులో స్థానికులు పెట్టి ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలు భారీ కురుస్తుండడంతో జరిగే నష్టాలపై సమాచారమందించేందుకు సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. అలాగే, సిబ్బంది కూడా సక్రమంగా సమయపాలన పాటించడం లేదని, డీడీవో కార్యదర్శి జాడలేదని వేంగడ మాజీ సర్పంచ్ సివేరి కొండలరావు ఆరోపించారు. అధికారులు స్పందించి, సచివాలయం సిబ్బంది అందుబాటులో ఉంటూ సేవలందేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

'నకిలీ కుల ధ్రువ పత్రాలతో గిరిజనేతరులు లబ్ధి'


తహశీల్దార్ ఆనందరావుకి ఫిర్యాదు చేస్తున్న గిరిజన ఉద్యోగుల సంఘం నాయకులు

చింతపల్లి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాలను పొందిన గిరిజనేతరులపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని గిరిజన ఉద్యోగుల సంఘం మండలాధ్యక్షుడు బౌడు గంగరాజు డిమాండ్ చేశారు. మంగళవారం గొందిపాకలు గ్రామం నుంచి నకిలీలు గిరిజన కులధ్రువీకరణ పత్రాలు పొంది ఆదివాసీ హక్కులను దెబ్బతిస్తుండడంపై స్థానిక తహసీల్దార్ జి. ఆనందరావును ఉద్యోగుల సంఘం నాయకులు కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గంగరాజు మాట్లాడుతూ గొందిపాకలు గ్రామం నుంచి చింతపల్లి జోత్స్న ప్రియ, దుమ్ముల అనిత కుమారి, దుమ్ముల మధుబాబు, చింతపల్లి రాంబాబులు ఎస్టీ వాల్మీకి కుల ధ్రువీకరణ పత్రం పొందారన్నారు. ఎస్టీ వాల్మీకిలో చింతప ల్లి, దుమ్ముల ఇంటి పేర్లులేవన్నారు. అడ్డదారిలో గిరిజన రాయితీలను పొందుతున్న వీరిపై విచారణ చేపట్టి కుల ధ్రువీకరణ ప త్రాలను రద్దు చేయాలన్నారు.గిరిజన ఉద్యోగుల సంఘం నాయకులు దేపూరి శశికుమార్, యూవీ గిరి, లోచలి రామకృష్ణ, గె మ్మెలి మోహన్‌రావు, ఏఎంసీ వైస్ చైర్మన్ రొబ్బ జస్వంత్, డైరెక్టర్ కేశవరావు, బెన్నవరం ఎంపీటీసీమాజీ సభ్యుడు కంఠం నాయుడుపాల్గొన్నారు.

పాడేరు ఎంఈవోగా మోరి జాన్


ఎంఈవో మోరి జాన్‌కు అభినందనలు తెలుపుతున్న టీచర్లు

పాడేరు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): పాడేరు ఎంఈవో మోరి జాన్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. అరకులోయ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎంగా పని చేస్తున్న ఆయనకు ఎంఈవోగా పదోన్నతి లభించింది. దీంతో ఆయన మంగళవారం స్థానిక ఎంఈవోగా బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మాసాడ ఈశ్వరరావు, గిరిజన ఉద్యోగుల సంఘం నేత వి.కొండలరావు, పలువురు ఉపాధ్యాయులు ఎంఈవో జాన్‌కు పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు. మండలంలో విద్యాభివృద్ధికి కృషి చేస్తానని ఈసందర్భంగా ఎంఈవో జాన్ పేర్కొన్నారు.

మట్టి వినాయక విగ్రహాలనే పూజించాలి


మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న టీడీపీ నేత సుబ్బారావు తదితరులు

పాడేరురూరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతీ ఒక్కరు మట్టి వినాయక విగ్రహాలను పూజించాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొట్టగుళ్లి సుబ్బారావు కోరారు. పాడేరు ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డులో ఉన్న మణికంఠ షాపింగ్ కాంప్లెక్స్ వద్ద మంగళవారం ఆయన మట్టి వినాయక విగ్రహాలను భక్తులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అమరావతి హోటల్ యాజమాన్య గణేష్, బాడా కేర్ జిమ్ యాజమాన్యం కె.రాంబాబు, వర్మ సత్తిబాబు, బూరెడ్డి కొండబాబు, వర్తక సంఘం పెద్దలు పాల్గొన్నారు స్థానిక ఎస్‌బీఐ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ సం గ్రంజిత సాహో ఎస్‌బీఐ ఎస్‌యూ ఏపీ బ్యాంక్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు.యూనియన్ లోకల్ సెక్రటరీ డీఎంఎస్.శ్రీనివాస్, కుమార్, సోములు, కిరణ్, శివ, సూర్య, మూర్తి, నాయుడు పాల్గొన్నారు.


వివిధ వేషధారణలో 'సీలేరు డీవీఏ పాఠశాల విద్యార్థులు

పర్యావరణ హితంగా ఉత్సవాలు జరుపుకోవాలి

చింతపల్లి: ప్రజలు పర్యావరణానికి హాని కలగకుండగా వినాయక ఉత్సవాలు జరుపుకోవాలని స్థానిక ప్రభుత్వం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. విజయ భారతి సూచించారు. మంగళవారం కోఫోకాన్ కరాటే క్లబ్ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ బాకూరు పాండురాజు, విద్యార్థులు మట్టి వినాయక విగ్రహాలను తయారు చేసి ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలందజేశారు.

డీఏవీ పాఠశాలలో చవితి వేడుకలు

సీలేరు: స్థానిక మేజర్ పంచాయతీ డీఏవీ పాఠశాలలో ముందస్తు చవితి వేడుకలు నిర్వహించారు. హెచ్ఎం ఎస్. కిరణ్ కుమార్ చవితి పూజావిధానాన్ని విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు వినాయక చవితి వ్రత కథ విశిష్టతను నాటక రూపంలో ప్రదర్శించారు.

కలెక్టర్, ఐటీడీఏ పీవోకు జాతీయ ఎస్టీ కమిషన్ నోటీసులు

- గర్భిణి మృతి వ్యవహారంపై సీరియస్

రంపచోడవరం/ వై.రామవరం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): రంపచోడవరం ఏరియా ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యానికి ఓ గిరిజన మహిళ మృతి చెందిన వ్యవహారంలో అల్లూరి జిల్లా కలెక్టర్, రంపచోడవరం ఐటీడీఏ పీవో జాతీయ ఎస్టీ కమిషన్ నోటీసులు జారీ చేసింది. ప్రసవం కోసం 14 రోజులపాటు వైద్యుల పర్యవేక్షణలోనే రంపచోడవరం ఆసుపత్రిలో ఉన్న తన భార్య కాకూరి పార్వతి (26) పట్ల వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించి ఆమె మృతికి కారణ మ య్యారని, దీంతో అనాధలుగా మిగిలిన తన ఇద్దరి పిల్లలకు, తనకూ న్యాయం చేయాలంటూ వై. రామవరం మండలం జాజిగడ్డకు చెందిన పడాల దుర్గాప్రసాద్ ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. గత జూలై 11న కాకూరి పార్వతి ప్రసవ సమయంలో రంపచోడవరం ఆస్పత్రిలో పార్వతి ప్రాణాపాయ స్థితికి చేరుకున్నాక, ఆమెను రాజ మండ్రి జిల్లా ఆసుపత్రికి తరలించినట్టు ఆయన ఆరోపించారు. గిరిజనులకు అండగా నిలవాల్సిన రంపచోడవరం ఐటీడీఏ ఈ మృతి పై సరిగా స్పందించలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. విచారణకు స్వీకరించిన కమిషన్ జిల్లా కలెక్టరు, ఐటీడీఏ పీవోలకు నోటీసులు జారీ చేసి పై అభియోగాలపై తీసుకున్న చర్యల నివేదికను 15రోజుల వ్యవధిలో తమకు సమర్పించాలని కమిషన్ డైరెక్టర్ డాక్టర్ కళ్యాణరెడ్డి ఆదేశించారు. లేకుంటే చట్టపరంగా తీసుకోవాల్సిన చర్యలను తీసుకుంటామని హెచ్చరించారు.

ఎరువులు అక్రమంగా నిల్వ చేస్తే చర్యలు: సీఐ


ఎరువుల దుకాణాల్లో స్టాక్ పరిశీలిస్తున్న సీఐ వినోద్ కుమార్, రెవెన్యూ ఉద్యోగులు

చింతపల్లి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): దుకాణాల్లో ఎరువులను అక్రమంగా నిల్వ చేస్తే సంబంధిత యజమానులపై చర్యలు తీసుకుంటామని స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం. వినోద్ బాబు హెచ్చరించారు. బుధవారం రెవెన్యూ అధికారులతో కలిసి పోలీసులు మండల కేంద్రంలోనున్న ఎరువులు దుకాణాలను తనిఖీలు చేశారు. దుకాణ యజమానులు విక్రయానికి సిద్ధం చేసిన ఎరువుల నిలువలు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ దుకాణ యజమానులు ఎరువులను అక్రమంగా నిల్వ చేసి, కృత్రిమ కొరత సృష్టిస్తే సహించేదిలేదన్నారు. రైతులకు అవసరమైన ఎరువులను యజమానులు నిర్ణయిత ధరకు విక్రయించాలన్నారు. ప్రభుత్వం యూరియాను వారం రోజుల్లో యూరియా అందుబాటులోకి తెస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకట రమణ, ఆర్ఐ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

హైడ్రో పవర్ ప్రాజెక్టును నిలిపివేయాలని వినతి


డిప్యూటి తహశీల్దార్‌కు వినతి పత్రమిస్తున్న గిరిజన సంఘనేతలు, గిరిజనులు

హుకుంపేట ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): అనంతగిరి మండలంలో ప్రభుత్వం హైడ్రో పవర్ ప్రాజెక్టుకు మంజూరు చేసిన అనుమతులు తక్షణమే నిలుపు చేయాలని గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణారావు డిమాండ్ చేశారు. ఈ హైడ్రో పవర్ ప్రభావిత మండలంలోని మజివలస, బూర్జ గ్రామాలకు చెందిన గిరిజనులతో కలిసి గిరిజన సంఘం నేతలు స్థానిక డిప్యూటి తహశీల్దార్‌కు మంగళవారం వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూ గిరిజనుల హక్కులు, చట్టాలను తుంగలోకి తొక్కి హైడ్రో పవర్‌కు అనుమతులు మంజూరు చేయడం అన్యాయమన్నారు. వీటిని రద్దు చేసి పనులు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే భారీ ఎత్తున ఉద్యమం చేస్తామని పిలుపు నిచ్చారు. ఈకార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు హరి, గిరిజన సంఘం నేతలు తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రుల్లోని పారిశుధ్య కార్మికుల ఆందోళన



సంఘీభావం తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

పాడేరురూరల్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలోని వివిధ ప్రభుత్వ ఆస్పత్రులలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే లేకుంటే ఆందోళన చేపడతామని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి లింగేటి సుందరరావు హెచ్చరించారు. మంగళవారం పాడేరులో పారిశుధ్య కార్మికుల జిల్లా స్థాయి విస్తృత సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రి పారిశుధ్య కార్మికులకు 2024 నవంబర్‌లో పెంచిన కొత్త వేతన జీవోను వెంటనే అమలు చేసి ఏరియర్స్ చెల్లించాలని కోరారు. గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, ఈపీఎఫ్, ఈఎస్ఐ అమలులో తప్పిదాలను సరిచేయాలన్నారు. అనంతరం కార్మికుల జిల్లా కమిటీ ఎన్నిక జరిగింది. జిల్లా అధ్యక్షురాలిగా ముత్యాలమ్మ(పాడేరు), కార్యదర్శిగా రము(అరకు)తో పాటు కార్యవర్గ సభ్యులను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక జిల్లా ఆస్పత్రి, మెడికల్ కళాశాల, అరకు ఏరియా ఆస్పత్రి, ముంచంగిపుట్టు, చింతపల్లి ఆస్పత్రుల పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు సమాజానికి పెద్ద సవాల్: జిల్లా జడ్జి


అవగాహన సదస్సులో పాల్గొన్న జిల్లా జడ్జి రాము

పాడేరురూరల్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు సమాజానికి పెద్ద సవాల్‌గా మారినట్టు జిల్లా జడ్జి రాము అన్నారు. బాల్య వివాహాలతో కలిగే అనర్థాలపై స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పురాతన కాలం నుంచి సాంప్రదాయం, ఆచారాల్లో భాగంగా బాల్యవివాహాలుండడంతో వీటిని నిరోధించలేక పోతున్నామన్నారు. ప్రస్తుత ఆధునిక సమాజంలో ప్రతి ఒక్కరి దృక్పథం మారాలని సూచించారు. 2006 బాల్య వివాహాల చట్టం ప్రకారం స్త్రీకి 21, పురుషునికి 24 ఏళ్లు నిండిన తరువాత మాత్రమే వివాహం జరిపించాలన్నారు. అలా కాకుండా జరిపిస్తే తల్లిదండ్రులకి శిక్ష పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ చీపురు రమాదేవి, న్యాయవాది ప్రసాద్ నాయుడు, సీడ్ ఆర్గనైజేషన్ డైరెక్టర్ సన్యాసిరావు, కో-ఆర్డినేటర్ నాగమణి, విద్యార్థులు పాల్గొన్నారు.

బంగారు కుటుంబాల దత్తతకు ప్రోత్సహించాలి

గూడెంకొత్తవీధి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేందుకు ప్రజలు ముందుకు రావాలని స్థానిక ఎంపీడీవో వై. ఉమామహేశ్వరరావు అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో గ్రామ సచివాలయం ఉద్యోగులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉద్యోగులు, ఆర్థికంగా మెరుగ్గా ఉన్న ప్రజలు బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే వర్క్‌ఫ్రమ్ హోమ్ ద్వారా ఉద్యోగాలు చేసేందుకు పది, ఆపై విద్యార్హత కలిగిన యువతీ, యువకులను రిజిస్ట్రేషన్ చేయడంతోపాటూ ధ్రువపత్రాల పరిశీలన నిర్వహించాలన్నారు.

గిరిజన రైతులకు మొక్కలు పంపిణీ

కొయ్యూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి):గిరిజన రైతులు ఉద్యాన పంటలను సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎంవీవీ ప్రసాద్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో గిరిజన రైతులకు ఉద్యాన పంటల మొక్కలను ఉపాధి హామీ పథకం సిబ్బందితో కలిసి ఆయన పంపిణీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గిరిజన రైతులు ఆర్థిక ప్రగతికి రాష్ట్ర ప్రభుత్వం ఉద్యాన పంటల మొక్కలను పంపిణీ చేస్తుందన్నారు. మొక్కలు నాట్లు, సాగు ఖర్చుల కోసం మూడేళ్ల పాటు ప్రోత్సాహాలను అందజేస్తున్నట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయుడు మేడిపోయిన చక్రధర్‌రావు, వీఆర్‌పీ రాజు పాల్గొన్నారు.

పాడేరు ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా జ్ఞానప్రకాష్

ముంచంగిపుట్టు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఏపీయూడబ్ల్యూజే పాడేరు ప్రింట్, అండ్ ఎలక్ట్రానిక్ మీడియా పాడేరు ప్రెస్‌క్లబ్ నూతన కార్యకవర్గం ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ బి.ఎల్.స్వామి, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర కార్యదర్శి కిశోర్ కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి. నాగరాజు ఆధ్వర్యంలో ముంచంగిపుట్టులో ఈ ఎన్నికలు నిర్వహించారు. పాడేరు ప్రెస్‌క్లబ్ ప్రింట్ మీడియా అధ్యక్షుడిగా ఒ.జ్ఞానప్రకాష్, ప్రధాన కార్యదర్శిగా ఎస్.సురేశ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా కె.మోహన్, కె.శ్రీనివాసరావు, ఎస్.బాలరాజు, సంయుక్త కార్యదర్శులుగా ఎం.మోహన్, ఎం.అశోక్, కోశాధికారిగా ఎం.మహేశ్‌బాబుతో పాటు పలువురు సభ్యులుగా నియమితులయ్యారు. ఎలక్ట్రానిక్ మీడియా పాడేరు ప్రెస్‌క్లబ్ అధ్యక్షులుగా ఎస్.కొండలరావు, ప్రధాన కార్యదర్శిగా కె.జోషిలు ఎంపిక చేశారు.

'రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి'

పాడేరురూరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాలు, అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరే వారికి సకాలంలో మెరుగైన వైద్య సేవలందించాలని తెలుగుదేశం పార్టీ డివిజన్ నాయకుడు, దారెల పంచాయతీ సర్పంచ్ పాంగి పాండు రంగ స్వామి కోరారు. ఇటీవల పెదబయలు సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురై జిల్లా ఆస్పత్రిలో వైద్య సేవలు పొందుతున్న ముంచంగిపుట్టు మండలం దారెల గ్రామానికి చెందిన మండి మోహన్‌ను మంగళవారం ఆయన పరామర్శించారు. వైద్యం అందుతున్న తీరును అడిగితెలుసుకున్నారు. ప్రమాదంలో క్షతగాత్రులను పరామర్శించి ఆస్పత్రిలో వైద్యులు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రామలింగం, మురళి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి స్వయంభూ విఘ్నేశ్వర ఉత్సవాలు



స్వయంభూ విఘ్నేశ్వరుడు

చోడవరం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రలో ప్రసిద్ధి చెందిన స్థానిక స్వయంభూ విఘ్నేశ్వరాలయంలో నవ రాత్రి ఉత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. కార్యసిద్ధి వినాయకునిగా పేరున్న స్వయంభూ విఘ్నేశ్వరుడిని ఉమ్మడి రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి పూజలు చేస్తుంటారు. రెండు వందల సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ స్వయంభూ విఘ్నేశ్వరుడిని దర్శించుకుని వెళితే ఏ పనైనా జరిగిపోతుందని భక్తుల నమ్మకం. భూమిలో నుంచి వెలిసిన ఈ స్వయంభూ విగ్రహం ఏటా పెరుగుతుండడం విశేషంగా చెప్పుకోవాలి. విఘ్నేశ్వరుని తొండం సమీపంలోని చెరువు వరకూ ఉందని భక్తుల నమ్మకం. ఈ ఆలయానికి కొడమంచిలి కుటుంబీకులు వారసత్వ అర్చకులుగా కొనసాగుతున్నారు. కొడమంచిలి చలపతి ప్రస్తుతం ప్రధాన అర్చకులుగా కొనసాగుతున్నారు. ఆలయ చైర్మన్‌గా పసుమర్తి సాంబమూర్తి ఉత్సవాల నిర్వహణ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఉత్సవాల సందర్భంగా వారం రోజుల పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

మదర్ థెరిసాకు ఘన నివాళి

బుచ్చెయ్యపేట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్డాదిలో అతిథి దేవోభవ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మదర్ థెరిసా 115వ జయంతిని ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు ఆమె చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా క్విజ్, వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో అతిథి దేవోభవ స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి అరిపాక కామేశ్వరరావు, దొండా నరేష్, తలారి శంకర్ పాల్గొన్నారు.

వైద్య సేవలపై టాస్క్‌ఫోర్స్ అధికారుల పరిశీలన



వైద్యసేవల తీరుపై వివరాలు సేకరిస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

చోడవరం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతంలో అందుతున్న ఆరోగ్య సేవలపై మంగళవారం జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారుల బృందం పరిశీలించింది. మండలంలోని చోడవరం-2 ఆయుష్మాన్ ఆరోగ్యకేంద్రం, జ్యోతిరావు పూలే స్కూల్‌ను సందర్శించిన టాస్క్‌ఫోర్స్ అధికారులు రికార్డులు పరిశీలించారు. గర్భిణులు, బాలింతలు, కౌమార బాలికలతో మాట్లాడారు. వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలకు అవగాహన కలిగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ అధికారులు ఏ. రామచంద్రరావు కే. జగదీశ్, వై. జనార్ధన్, బి. త్రిమూర్తులు, పి.సింహాచలం, కె. రత్నం, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా మోదకొండమ్మ ఘటాల పండుగ



వర్షంలో అమ్మవారి ఘటాలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

మాడుగుల, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మాడుగుల మోదకొండమ్మ అమ్మవారి ఇంటి ఘటాల పండుగను భక్తులు ఘనంగా నిర్వహించారు. మంగళవారం వేకువజామున అమ్మవారిని సుందరంగా అలంకరించి ప్రత్యేక అభిషేకాలు, కుంకుమ పూజ, అర్చనలు వంటి పూజా కార్యక్రమాలను అర్చకులు నిర్వహించారు. అనంతరం భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. మోదమాంబ కాలనీకి చెందిన తుంపాల తాతీలు, పుష్పాంజలి దంపతుల కుమారుడు సాయి దంపతులు 101 అమ్మవారి ఘటాల పండుగను నిర్వహించి అమ్మవారికి మొక్కులు చెల్లించారు. బోరున వర్షం కురుస్తున్నప్పటికీ ఘటాలతో ఊరేగింపుగా వెళ్లి మొక్కు తీర్చుకున్నారు. ఆలయానికి వెళ్లిన భక్తులకు కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు.

కొత్తకోటలో మండల పరిషత్ స్థలం ఆక్రమణపై సర్వే

రావికమతం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): కొత్తకోటలోని మండల పరిషత్‌కు చెందిన స్థలం ఆక్రమణలు గుర్తించేందుకు మంగళవారం ఎంపీడీవో ఎన్. సీతారామస్వామి ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది సర్వే నిర్వహించారు. సర్వే నంబరు 140లో మండల పరిషత్‌కు చెందిన రెండు ఎకరాల 17 సెంట్లు భూమి ఉందని, దీనిలో ఎక్కువ శాతం ఆక్రమణలకు గురైందని గ్రామ ఎంపీటీసీ సభ్యుడు పూడి దేవా జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎంపీడీవో సీతారామస్వామి, గ్రామ సచివాలయ సర్వేయర్, పంచాయతీ కార్యదర్శి, వీఆర్వోలు ఈ ఆక్రమణలను గుర్తించేందుకు సర్వే చేపట్టారు. ఈ స్థలంలో ఆక్రమణలకు సంబంధించి పూర్తి నివేదికను రెండు రోజుల్లో అందజేస్తామని ఎంపీడీవో సీతారామస్వామి తెలిపారు.

పింఛన్ల పంపిణీ నుంచి అంగన్‌వాడీలకు మినహాయింపు

ప్రతి నెల చేపట్టే పింఛన్ల పంపిణీ నుంచి అంగన్‌వాడీ సిబ్బందికి మినహాయింపు ఇచ్చామని ఎంపీడీఓ సీతారామస్వామి తెలిపారు. మహిళా,శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ నుంచి ఈ మేరకు ఆదేశాలు అందడంతో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు.

'ఒకటి, రెండు బస్తాల యూరియా మాత్రమే ఇవ్వాలి'

రావికమతం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఒక్కరికే అధిక మొత్తంలో యూరియా విక్రయించరాదని తహశీల్దార్ అంబేడ్కర్, ఎంపీడీవో ఎన్. సీతారామస్వామి హెచ్చరించారు. మంగళవారం రావికమతంలోని శ్రీనివాస ఫెర్టిలైజర్స్ షాపులో ఎరువుల నిల్వలను వారు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఒక్క రైతుకు ఒక్కటి, రెండు బస్తాలకు మించి యూరియా అమ్మకూడదని ఆదేశించారు. యూరియా స్థానంలో నానో యూరియాను ఉపయోగించేలా రైతులను చైతన్యవంతులను చేయాలని వారు షాపు యజమానికి సూచించారు. అలాగే ఎరువులు, క్రిమిసంహారక మందులు కొన్న ప్రతి రైతుకు రశీదు ఇవ్వాలని, ఎమ్మార్పీ ధరకు మించి అమ్మరాదన్నారు. అనంతరం వచ్చిన ఎరువులు, నిల్వ స్టాక్‌ను రికార్డులను పరిశీలించగా.. యూరియా నిల్వ లేదని, డీఏపీ మాత్రమే ఉన్నట్టు గుర్తించారు.

మట్టి వినాయక ప్రతిమలనే పూజించాలి: ఆర్డీవో



నర్సీపట్నంలో మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేస్తున్న ఆర్డీవో

గొలుగొండ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): చవితి సందర్భంగా మట్టి వినాయక ప్రతిమలనే పూజించాలని ఆర్డీవో వీవీ.రమణ కోరారు. మునిసిపాలిటీ పరిధిలోని ఆర్డీవో కార్యాలయం వద్ద మంగళవారం గ్రీన్‌క్లబ్ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ మట్టి వినాయక విగ్రహాలను పూజించి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో గ్రీన్‌క్లబ్ సభ్యులు డీజీ.నాథ్, కురస వెంకటరమణ, లక్ష్మీనరసింహ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు పాలనలో 1,96,619 ఉపాధ్యాయ ఉద్యోగాలు

» ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు



చోడవరం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 14 సంవత్సరాల పాలనలో 14 డీఎస్సీల ద్వారా 1,96,619 ఉపాధ్యాయ ఉద్యోగాలు కల్పించారని చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు తెలిపారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఎన్నికల ముందు నిరుద్యోగులకు చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు డీఎస్సీ ప్రకటించి 16,347 టీచరు పోస్టులను భర్తీచేయడం చరిత్రగా అభివర్ణించారు. పారదర్శకంగా మెగా డీఎస్సీ నిర్వహించి, వేలాది మంది నిరుద్యోగులకు ఉపాధ్యాయులుగా నియమిస్తున్నదన్నారు. విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ సారథ్యంలో విద్యారంగంలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకువచ్చారన్నారు. 2014-2019 మధ్య డీఎస్సీల ద్వారా 18 వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసిన తెలుగుదేశం ప్రభుత్వం ప్రస్తుతం మరో 16,347 పోస్టులను భర్తీ చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత రాష్ట్రంలో కస్తూర్బాగాంధీ విద్యాలయాల్లో 729 నాన్‌టీచింగ్ సిబ్బందిని నియమించడంతోపాటు, 700 కోయభారతి పోస్టులు భర్తీ, జూనియర్ కాలేజీల్లో 700 మంది ఉద్యోగుల సేవలు పునరుద్ధరించారని చెప్పారు. రాష్ట్రంలో 476 ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో 3,619 మంది కాంట్రాక్టు లెక్చరర్ పోస్టులు రెన్యువల్ చేసి కాలేజీ విద్యకు ప్రోత్సాహం కల్పించిన ఘనత మంత్రి లోకేశ్‌కు దక్కుతుందన్నారు. నాడు వైసీపీ హయాంలో సీఎం జగన్ ఉపాధ్యాయులపై కక్షతో విద్యారంగాన్ని నాశనం చేస్తే.. ప్రస్తుతం కూటమి పాలనలో విద్యా వ్యవస్థను గాడిలో పెట్టారని ఎమ్మెల్యే రాజు కొనియాడారు.

మట్టి వినాయక ప్రతిమలు పర్యావరణానికి మేలు

» ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి



మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

కె.కోటపాడు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి వినాయక ప్రతిమలనే పూజించాలని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక రామకోవెల ప్రాంగణంలో మహిళలకు మట్టి వినాయక ప్రతిమలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలు ఆకర్షణీయంగా ఉంటాయని, వాటి వల్ల మానవ మనుగడపై తీవ్ర దుష్పరిణామాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ రొంగలి మహేష్, టీడీపీ నాయకులు డోకల నరసింహమూర్తి, సబ్బవరపు రామునాయుడు, జూరెడ్డి రాము, దాడి ఎరుకునాయుడు, బండారు నరసింహనాయుడు, కన్నూరు సూర్యనారాయణ, బొడ్డు అక్కునాయుడు, పూడి శ్రీను, ఎంపీడీవో సాంబశివరావు, ఎంఈఓ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కొత్తకోటలో..

రావికమతం: మండలంలో కొత్తకోటలో గుణ ఎంటర్ ప్రైజెస్ యజమాని పచ్చిగోళ్ల సంతోష్ మంగళవారం 300 మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. పదేళ్ళుగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్నామని సంతోష్ తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు.

చోడవరంలో..

స్థానిక ఉషోదయ విద్యాసంస్థల్లో మంగళవారం మట్టి వినాయక బొమ్మలను సంస్థ చైర్మన్ జెర్రిపోతుల రమణాజీ పంపిణీ చేశారు. జెర్రిపోతుల రమణాజీ ఛారిటబుల్ ట్రస్ట్, కాలేజీ ఎన్ఎస్ఎస్ టీమ్‌ల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీన్ ఎస్‌వీ. వాసు, ప్రిన్సిపాల్, లెక్చరర్లు పాల్గొన్నారు.

రోలుగుంటలో..

రోలుగుంటలో ధన్వంతరి సహస్రాయ పీఠం ఆధ్వర్యంలో మంగళవారం మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పీఠం సభ్యులు ఆడారి గణేష్ పాత్రో మాట్లాడుతూ వినాయకస్వామి పండుగను సంప్రదాయబద్ధంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని కోరారు. పర్యావరణ పరిక్షణకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని ఆకాక్షించారు.

దేవరాపల్లిలో..

మట్టి వినాయకుడి ప్రతిమలకు ప్రజలు పూజించాలని స్థానిక హైస్కూల్ హెచ్ఎం సీహెచ్ ఉమ అన్నారు. డ్రాయింగ్ ఉపాధ్యాయుడు వై.సముద్రం చేసిన మట్టి వినాయకుడి బొమ్మలను ఉపాధ్యాయులు అందరికీ పంపిణీ చేశారు.

యూరియా కోసం రైతుల బారులు



యూరియా కోసం వేచి ఉన్న రైతులు

కె.కోటపాడు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కుండపోతగా వర్షం కురుస్తున్నా రైతులు యూరియా కోసం మంగళవారం రైతు సేవా కేంద్రాల వద్ద బారులు తీరారు. మండలంలోని ఆర్‌వై అగ్రహారం ఆర్‌బీకే వద్ద యూరియా కోసం రైతులు వాగ్వాదానికి దిగారు. ఆర్‌వై అగ్రహారం ఆర్‌బీకేకు 250 యూరియా బస్తాలు శుక్రవారం వచ్చాయి. దీంతో శనివారం ఉదయానే ఆర్‌వై అగ్రహారం, ఉగ్గినవలస, పోతనవలస, యడ్లవానిపాలెం, చిరికివానిపాలెం గ్రామాల రైతులు గంటల తరబడి బారులు తీరారు. కంపెనీ వారు స్టాక్ ఆన్‌లైన్ చేయకపోవడంతో ఆ రోజు పంపిణీ జరగలేదు. ఆదివారం సెలవు కావడం సోమవారం ఇస్తారని ఆతృతతో రైతులు ఎదురు చూసి వెనుదిరిగారు. మండల వ్యాప్తంగా అన్ని కేంద్రాల వద్ద మంగళవారం యూరియా ఇస్తారని సమాచారం తెలుసుకున్న రైతులు ఉదయం ఐదు గంటల నుంచి ఒక్క బస్తా యూరియా కోసం ఆధార్, పాస్‌బుక్, రేషన్ కార్డు, పలు రకాల ఆధారాలతో లైన్‌లో పడిగాపులు కాశారు. ఉదయం నుంచి వర్షం పడడంతో వర్షాన్ని కూడా లెక్క చేయకుండా యూరియా కోసం అన్నదాతలు రైతు సేవా కేంద్రం వద్ద బారులు తీరారు. తీరా యూరియా కోసం రైతులు వాగ్వాదానికి దిగారు. రైతులకు మంగళవారం 267 యూరియా బస్తాలను పంపిణీ చేసినట్టు ఏవో సోమశేఖర్ తెలిపారు.

ఎడతెరిపిలేని వర్షం



మాడుగులలో కురుస్తున్న వర్షంలో గొడుగులతో వెళుతున్న ప్రజలు

మాడుగుల/రూరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : మాడుగులలో మంగళవారం ముసురు వాతావరణం ఉంది. తెల్లవారు జాము నాలుగు గంటల నుంచి ఎడ తెరిపిలేకుండా వర్షం కురుస్తునే ఉంది. రోడ్లు జలమయమయ్యాయి, పంట పొలాల్లోకి భారీగా నీరు చేరింది. వాతావరణం చల్లబడడంతో ప్రజలు ఉపశమనం పొందారు. అయితే వరినాట్లు వేసిన పొలాలకు ఈ వర్షం కొంతవరకు నష్టాన్ని చేకూరుస్తుందని రైతులు అంటున్నారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు గొడుగులు, రెయిన్‌కోట్లు ధరించి వర్షంలో వెళ్లేందుకు ఇబ్బంది పడ్డారు. అలాగే ద్విచక్ర వాహనాలపై ప్రయాణించేవారు కూడా ప్రయాణాలు సాగించేందుకు అవస్థ పడ్డారు. కాగా బుధవారం వినాయక చవితి పండగ సందర్భంగా పూజా సామగ్రి, వినాయక ప్రతిమలు, పండ్లు, ఇతర సరుకులు అమ్మే దుకాణదారులు వర్షం వల్ల చాలా ఇబ్బంది పడ్డారు. సరుకులు తడిచిపోకుండా టార్పాన్లు, పరదాలు కప్పుకుని వ్యాపారం చేశారు.

చోడవరంలో...

అల్పపీడన ప్రభావంతో మండలంలో మంగళవారం ఉదయం నుంచి వర్షం కురుస్తున్నది. ఉదయం నుంచి ప్రారంభమైన వర్షం సాయంత్రం వరకూ పడుతూనే ఉంది. ముసురును తలపించేలా రోజంతా విరామం లేకుండా కురుస్తున్న వర్షానికి వాతావరణం చిత్తడిగా మారింది. పది రోజుల క్రితం కురిసిన భారీ వర్షంతో ఇప్పటికే నీటిముంపునకు గురైన పంట పొలాలు ఇప్పుడిప్పుడే తేరుకుంటుండగా..మరో రెండురోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణశాఖ అధికారుల హెచ్చరికలు రైతులు ఆందోళన చెందుతున్నారు.

రావికమతంలో..

మండలంలో మంగళవారం కుండపోతగా వర్షం కురిసింది. ఇప్పటికే రైతులు దమ్ములు, వరి నాట్లు పనుల్లో నిమగ్నమై ఉన్నారు. ఈ సమయంలో అల్పపీడనం ప్రభావంతో ఆదివారం రాత్రి నుంచి వర్షం కురుస్తునే ఉంది. దీంతో ఉదయం నుంచి జన జీవనం అస్తవ్యస్తంగా మారింది. ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. కురిసిన వర్షానికి ఎక్కడ నీరు అక్కడే తేలిపోయింది. మండలంలో 32.2 ఎంఎం వర్షపాతం నమోదయ్యింది. దీంతో గెడ్డలు, వాగులు పొంగి పారుతున్నాయి.

బుచ్చెయ్యపేటలో...

మండలంలో మంగళవారం ఉదయం నుంచి వర్షం ఎడతెరిపి లేకుండా కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు 45.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జనం ఇళ్లకే పరిమితమయ్యారు. వర్షానికి వడ్డాది పెద్దేరు నది ఉధృతంగా ప్రవహిస్తున్నది. వడ్డాది ప్రజలు కుంగిన వంతెనపై నుంచి రాకపోకలు చేస్తున్నారు. డైవర్షన్ రోడ్డు మొన్న కురిసిన వర్షాలకు కొట్టుకుపోవడంతో పూర్తిగా మూసివేశారు. విజయరామరాజు పేట వద్ద తాచేరు డైవర్షన్ రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు కొట్టుకుపోవడంతో మూసివేశారు. రహదారులు, ట్రాఫిక్, ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నామని ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపారు.

చీడికాడలో...

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా మంగళవారం వేకువజాము నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తున్నది. వరి పొలాలు ముంపునకు గురయ్యాయి. వర్షానికి రైతులు తమ పొలాలు, కళ్లాలకు వెళ్లలేకపోయారు. సాగునీటి చెరువులు కళకళలాడుతున్నాయి. కాగా మండలంలో కోనాం శివారు చినకోనాంలో వర్షం పడితే రోడ్డంతా నీరు చేరి నడవడానికి ఇబ్బందిగా మారుతుంది. దీంతో గ్రామంలో దోమలు పెరిగి ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారని గ్రామానికి చెందిన శీరా మోదినాయుడు, శ్రీను, మురుకుర్తి శ్రీను, దేముడు, చినబోయిన చినతల్లి తదితరులు తెలిపారు. మంగళవారం కురిసిన వర్షానికి చినకోనాం యాదవ వీధిలో ఉన్న మట్టి రోడ్డు ముంపునకు గురై చెరువును తలపిస్తున్నది. ఈ వీధిలో డ్రైనేజీ లేక ఇబ్బందులు పడుతున్నామని, అధికారులకు ఎన్నిమార్లు విన్నవించినా పట్టించుకోలేదని వాపోయారు.

గొలుగొండలో...

మండలంలోని గొలుగొండ, జోగంపేట, పాకలపాడు, సాలికమల్లవరం, చీడిగుమ్మల, గుండుపాల, రావణాపల్లి తదితర గ్రామాల్లో మంగళవారం వర్షం పడింది. ఏటిగైరంపేట వద్ద రాళ్లగెడ్డ, ధారమఠంలో ధారగెడ్డ, గొరిగెడ్డ నీరు ఉధృతిగా ప్రవహించింది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పార్టీలో చురుగ్గా పనిచేస్తే ప్రాధాన్యం

» తాండవ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

నాతవరం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మండల కమిటీల్లో చురుగ్గా పనిచేసే వారికి అన్ని వర్గాల వారికి ప్రాధాన్యత ఇస్తామని తాండవ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ పేర్కొన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ ఆధ్వర్యంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ఏర్పాటు చేసిన కమిటీ ఆధ్వర్యంలోనే వచ్చే స్థానిక ఎన్నికలకు వెళ్తామన్నారు. మనస్పర్థలు లేకుండా కలిసి పనిచేయాలని కోరారు. అలాగే ఓటరు లిస్టును జాగ్రత్తగా పరిశీలించాలని సూచించారు. ఎంబీ.పట్నం గ్రామానికి చెందిన మాజీ వైస్ ఎంపీపీ పల్లి బాపన్ననాయుడు, మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్‌లు ఎ.మాణిక్యం ఎస్.సన్యాసిదేముడు, కొంగ్రు మరిడియ్య, శెట్టిలోవ, సూరిబాబు, జీరెడ్డి రాజుబాబు, చింతకాయల శ్రీనువాసు, శెట్టి గోపి పాల్గొన్నారు.

'కల్యాణపులోవ'ను పరిశీలించిన ఇరిగేషన్ ఈఈ



కల్యాణపులోవ రిజర్వాయర్ నీటిమట్టాన్ని పరిశీలిస్తున్న ఇరిగేషన్ ఈఈ బాల సూర్యం

రావికమతం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలో కల్యాణపులోవ రిజర్వాయర్‌ను మంగళవారం ఇరిగేషన్ నర్సీపట్నం డివిజన్ ఈఈ బాలసూర్యం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందితో మాట్లాడుతూ అల్పపీడన ద్రోణి ప్రభావంతో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఇన్‌ఫ్లోను ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. జలాశయం వద్ద ఇరిగేషన్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఏఈ సూర్యకు సూచించారు. రిజర్వాయర్ గరిష్ఠ నీటిమట్టం 460 అడుగులు కాగా ప్రస్తుతం 452.04 అడుగుల వద్దే ఉందని, మరో ఐదు అడుగుల మేర నీటి మట్టం పెరిగితేనే గాని ప్రమాద స్థాయికి రాదని ఏఈ వివరించారు. ప్రస్తుతం కొండ గెడ్డల ద్వారా రిజర్వాయర్‌లోకి ఇన్‌ఫ్లో 80 క్యూసెక్కుల మాత్రమే వస్తుందన్నారు. సోమవారం నామమాత్రపు వర్షపాతం మాత్రమే నమోదైందని, రోజూ రిజర్వాయర్ నుంచి ఆయకట్టు భూములకు వంద క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామన్నారు. అయినప్పటికీ వర్షాలు తగ్గే వరకు సిబ్బంది రిజర్వాయర్ వద్ద అప్రమత్తంగా ఉండాలని, సర్పా నదిని ఆనుకొని ఉన్న గ్రామాల రైతులను అప్రమత్తం చేయాలని ఈఈ బాలసూర్యం ఏఈకి సూచించారు.

దేవరాపల్లి మార్కెట్ కిటకిట

దేవరాపల్లి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వినాయక పూజా సామగ్రి కొనుగోలుకు మంగళవారం దేవరాపల్లి మార్కెట్ కిటకిటలాడింది. మండలం కేంద్రం, పరిసర గ్రామాల ప్రజలు ఒకేసారి రావడంతో మార్కెట్ కిక్కిరిసింది. వినాయక చవితికి అవసరమైన సామగ్రిని కొనుగోలు చేసుకున్నారు.

ఘనంగా గంగాదేవి పండుగ



పూజలు అందుకున్న అమ్మవారు

గొలుగొండ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం గంగాదేవి పండుగను ఘనంగా నిర్వహించారు. కొత్తజోగంపేట, ద్వారకానగరం, పాతజోగంపేట గ్రామాల్లో అమ్మవారిని మహిళలు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

మట్టి వినాయక ప్రతిమల పంపిణీ

నాతవరం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి అల్లాడి సురేశ్ ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలను మంగళవారం పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణకు అందరూ వినాయకుని మట్టి విగ్రహలనే వాడాలని ఈ సందర్భంగా సురేశ్ కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నర్సీపట్నం నియోజకవర్గం ఇన్‌చార్జి రాజన వీరసూర్యచంద్ర, జనసేన మండల అధ్యక్షుడు వి.వెంకటరమణ, నాయకులు పి.హరినాథ్, పి.శ్రీనివాసరావు, ఎం.వెంకటరమణ పాల్గొన్నారు.

మెడికల్ కళాశాల భవన నిర్మాణం పూర్తిచేయాలి

మాకవరపాలెం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాల భవన నిర్మాణాన్ని పూర్తిచేసి ప్రారంభించాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక సభ్యులు కేవీ.రమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మాకవరపాలెం మండలం భీమబోయినపాలెంలో కాలేజీ నిర్మాణాన్ని పరిశీలించి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మూడు శ్లాబుల వరకు పనులు చేసి నిలిపివేశారని చెప్పారు దీనివల్ల ఇంతవరకూ వెచ్చించిన సొమ్ము వృథా అవుతుందన్నారు. ఈ కాలేజీ అందుబాటులో వస్తే యువతకు వైద్య విద్యలో అవకాశాలు పెరిగి ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కళాశాల భవన నిర్మాణ పనులు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని వారు కోరారు.

నేడు కిరండూల్ పాసింజర్ రైలు అరకు వరకే



విశాఖపట్నం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఎడతెరిపిలేని వర్షం కారణంగా ముందస్తు జాగ్రత్తలో భాగంగా బుధవారం విశాఖ-కిరండూల్ మధ్య నడిచే పాసింజర్ రైళ్ల గమ్యాలను విశాఖ-అరకు మధ్య పరిమితం చేసినట్లు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. విశాఖ-కిరండూల్ పాసింజర్ రైలు (58501) అరకు వరకు, తిరుగు ప్రయాణంలో కిరండూల్-విశాఖ పాసింజర్ రైలు (58502) అరకు నుంచి విశాఖకు నడుస్తాయన్నారు. అరకు-కిరండూల్ మధ్య రాకపోకలను రద్దు చేశామని పేర్కొన్నారు.

గంజాయి సాగు నిర్మూలనపై ప్రత్యేక దృష్టి

- రవాణా జరిగే మార్గాల్లో పలుచోట్ల చెక్‌పోస్టులు
- రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు
- విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి
- కశింకోట, అనకాపల్లిల్లో పోలీసు స్టేషన్ల తనిఖీ

కశింకోట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర, ఒడిశా సరిహద్దు (ఏవోబీ) ప్రాంతంలోని అల్లూరి సీతారామరాజు జిల్లాలో గంజాయి సాగు నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారించామని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి చెప్పారు. మంగళవారం ఆయన స్థానిక పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, గంజాయి రవాణా జరిగే రూట్లను గుర్తించి, ఆయా మార్గాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్టు చెప్పారు. రేంజ్ పరిధిలో 300 చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామని, అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని గంజాయి రవాణాను అరికడుతున్నామని తెలిపారు. గంజాయి రవాణా చేసేవారిలో 40 శాతం మంది ఏపీకి చెందిన వారుకాగా, మిగిలిన 60 శాతం మంది ఇతర రాష్ట్రాలకు చెందిన వారిగా దర్యాప్తులో గుర్తించినట్టు డీఐజీ చెప్పారు. జాతీయ రహదారిపై ప్రమాదాలను మరింత తగ్గించడానికి ఎన్‌హెచ్ఏఐ ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడి ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. జాతీయ రహదారిపై ప్రమాదాలు జరుగుతున్న జంక్షన్‌ల వద్ద సిగ్నల్ పాయింట్లు ఏర్పాటు చేయాలని ఆయా పోలీసు స్టేషన్ల అధికారులను ఆదేశించినట్టు చెప్పారు. డీఐజీ వెంట ఎస్పీ తుహిన్ సిన్హా, అనకాపల్లి డిఎస్పీ ఎం.శ్రావణి, స్థానిక సీఐ అల్లు స్వామినాయుడు, అనకాపల్లి రూరల్ సీఐ అశోక్‌కుమార్, పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్, ఎస్ఐలు లక్ష్మణరావు, మనోజ్‌కుమార్, సంతోశ్ తదితరులు వున్నారు..



అనకాపల్లి మహిళా పోలీస్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న డీఐజీ గోపీనాథ్ జట్టి



కశింకోట పోలీసు స్టేషన్‌లో మీడియాతో మాట్లాడుతున్న డీఐజీ గోపీనాథ్ జట్టి. పక్కన ఎస్పీ తుహిన్ సిన్హా, డీఎస్పీ శ్రావణి

పోలీస్‌స్టేషన్‌లను తనిఖీ చేసిన డీఐజీ

అనకాపల్లి టౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్, మహిళా పోలీస్‌స్టేషన్‌లను మంగళవారం విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి తనిఖీ చేశారు.

ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో ఇటీవల ఏర్పాటు చేసిన స్మార్ట్ మేనేజ్‌మెంట్ కంట్రోల్ రూంను పరిశీలించారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా బ్లాక్ స్పాట్స్ వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. మహిళా పోలీస్‌స్టేషన్ ద్వారా మహిళల భద్రతా చర్యలను మరింత పటిష్ఠం చేయాలని అధికారులకు సూచించారు. ఈవ్ టీజింగ్, యాంటీ ర్యాగింగ్, పోక్సో చట్టాలపై విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. డీఐజీ వెంట అనకాపల్లి డీఎస్పీ ఎం.శ్రావణి, సీఐలు టీవీ విజయ్‌కుమార్, ఎం.వెంకటనారాయణ, అశోక్‌కుమార్, స్వామినాయుడు, ఎస్ఐ శేఖరం ఉన్నారు.

నేడు భారీ వర్షం

- రేపటి నుంచి నెలాఖరు వరకు మోస్తరు వర్షాలు
- ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ ముకుందరావు

అనకాపల్లి అగ్రికల్చర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): రాగల ఐదు రోజుల్లో జిల్లాలో ఆకాశం మేఘావృతమై మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని స్థానిక ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ ముకుందరావు తెలిపారు. మంగళవారం ఇక్కడ జరిగిన వాతావరణ ఆధారిత వ్యవసాయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 27వ తేదీన భారీ వర్షం, 28 నుంచి 31వ తేదీ వరకు తేలికపాటి వర్షాలు పడే అవకాశం వుందన్నారు. వాతావరణం అనుకూలంగా వున్నందున వెంటనే వరి నాట్లు వేసుకోవాలని తెలిపారు. దమ్ములో ఎకరాకు 35 కిలోల యూరియా, 150 కిలోల సింగిల్ సూపర్‌ఫాస్ఫేట్, 17 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేసుకోవాలని సూచించారు. పొలంలో వరినాట్లు వేసే సమయంలో ప్రతి రెండు మీటర్లకు 20 సెంటీమీటర్ల మేర విడిచిపెట్టడం వల్ల పైరుకు గాలి, వెలుతురు బాగా తగిలి, చీడపీడల బెడద తగ్గుతుందన్నారు. ముదురు నారు నాటాల్సి వస్తే కుదురుకు 4 నుంచి 5 మొక్కల చొప్పున, 15 సెంటీమీటర్ల దూరంలో నాట్లు వేయాలని చెప్పారు. నత్రజని ఎరువును సిఫార్సు కంటే 25 శాతం పెంచి రెండు దఫాలుగా... 60 కిలోల యూరియా నాటేటప్పుడు మిగతా 25 కిలోలు అంకురం దశలో వేసుకోవాలని సూచించారు. కంది పైరులో వేరుకుళ్లు, కాండం కుళ్లు తెగుళ్ల నివారణకు కాపర్ ఆక్సిక్లోరైడ్ మందును లీటరు నీటికి మూడు గ్రాముల చొప్పున కలిపి తెగుళ్ల ఉధృతినిబట్టి 10 నుంచి 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలని సూచించారు. వంగ, టమాటా వంటి కాయగూరల పంటలకు ఆకుమచ్చ తెగులు ఆశిస్తే.. లీటరు నీటికి ఒక మిల్లీ లీటరు ప్రొపికొనజోల్ లేదా 2.5 గ్రాముల మాంకోజెబ్ కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. సమావేశంలో డాక్టర్ కె.వి.రమణమూర్తి, డాక్టర్ వి.గౌరి, డాక్టర్ సిహెచ్.రామలక్ష్మి, డాక్టర్ వి.చంద్రశేఖర్, డాక్టర్ ఎ.అలివేణి తదితరులు పాల్గొన్నారు.

ముసురు!

... 5వ పేజీ తరువాయి



మాడుగుల ఘాట్‌రోడ్డు సమీపంలో నీటమునిగిన వరి పొలం

ఇబ్బందులు ఎదురైతే వెంటనే సహాయ చర్యలు అందించాలని ఆదేశించారు. అధిక వర్షాల వల్ల పంటలకు నష్టం వాటిల్లకుండా వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు సూచనలు అందజేయాలని చెప్పారు.

జిల్లాలో 51.8 మిల్లీమీటర్ల వర్షపాతం

జిల్లాలో మంగళవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు 51.8 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా కె.కోటపాడు మండలంలో 95.6 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. చోడవరంలో 86.1 మిల్లీ మీటర్లు, కశింకోటలో 82.6, పరవాడలో 82.4, అనకాపల్లిలో 79, దేవరాపల్లిలో 74.9, మాడుగులలో 73, బుచ్చెయ్యపేటలో 73.4, మునగపాకలో 72.4, సబ్బవరంలో 71.2, చీడికాడలో 60.9, అచ్యుతాపురంలో 49, రావికమతంలో 48.6, రోలుగుంటలో 47.1, రాంబిల్లిలో 38.7, ఎలమంచిలిలో 37.1, మాకవరపాలెంలో 34.2, నర్సీపట్నంలో 29.6, నక్కపల్లిలో 20.8, కోటవురట్లలో 20.3, గొలుగొండలో 18.7, ఎస్.రాయవరంలో 18.4, నాతవరంలో 15.8, పాయకరావుపేటలో 13.9 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

ఆలయాల భూములు అన్యాక్రాంతం

... 5వ పేజీ తరువాయి

జారీ చేయించుకున్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి, మాడుగులలో సమగ్ర భూ సర్వే నిర్వహించి, దేవదాయ శాఖ భూములను గుర్తించి స్వాధీనం చేసుకోవాలని పలువురు కోరుతున్నారు.

200 ఎకరాలకు అక్రమంగా పాస్‌పుస్తకాలు జారీ

టీఎస్ఎస్ శర్మ, దేవదాయ శాఖ అధికారి, మాడుగుల

మాడుగులలో ఎనిమిది దేవాలయాలకు సంబంధిచి వెయ్యి ఎకరాలపైబడి మాన్యం భూములు వున్నాయి. ఇందులో 200 ఎకరాలకు సంబంధించి కొంతమంది సాగుదారులు తమ పేరున పట్టాదారు పాసు పుస్తకాలు మంజూరు చేయించుకున్నారు. దీనిపై తహశీల్దారుకు ఫిర్యాదు చేశాం. ఆర్‌వోఆర్‌లో అప్పీలు చేసుకోవాలని సూచించారు.

పరవాడ కళాశాల లెక్చరర్ సస్పెన్షన్

- విద్యార్థినిపట్ల అసభ్యకరంగా ప్రవర్తించినందుకు చర్యలు

పరవాడ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : పరవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల కెమిస్ట్రీ లెక్చరర్ గుత్తల శ్రీధర్‌ను సస్పెండ్ చేస్తూ ఇంటర్ బోర్డు రీజనల్ జాయింట్ డైరెక్టర్ మజ్జి ఆదినారాయణ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారని జిల్లా ఇంటర్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ (డీఐఈఓ) మద్దిలి వినోద్ బాబు తెలిపారు. లెక్చరర్ శ్రీధర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థినిని గత శనివారం కెమిస్ట్రీ ల్యాబ్‌కు పిలిపించి అసభ్యకరంగా ప్రవర్తించాడు. జరిగిన విషయాన్ని బాలిక తన తల్లికి చెప్పింది. బాలిక, తల్లి, సోదరుడుతో కలిసి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారించిన పోలీసులు లెక్చరర్‌ను అరెస్టు చేసి పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి, అతనిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ వ్యవహారాన్ని ఇంటర్‌బోర్డు తీవ్రంగా పరిగణించింది. లెక్చరర్ శ్రీధర్‌ను సస్పెండ్ చేస్తూ ఆర్‌జేడీ ఉత్తర్వులు జారీ చేశారు.

భవిష్యత్తు ప్రణాళికల కోసమే 'సేనతో సేనాని'

- ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

విశాఖపట్నం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధికి. జనసేన పార్టీ పురోభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు రూపొందించడానికే పార్టీ అధినేత పవన్ కల్యాణ్ సేనతో సేనాని కార్యక్రమం నిర్వహిస్తున్నారని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. హోటల్ దసపల్లాలో పార్టీ నాయకులతో కలిసి మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కుటుంబంలా సాగుతోందని, 14 నెలల్లో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సి ఉందన్నారు. దీనిపై ఈ నెల 28, 29, 30 తేదీల్లో విశాఖలో నిర్వహించే సమావేశాల్లో పార్టీ అధినేత పవన్ కల్యాణ్ దిశా నిర్దేశం చేస్తారన్నారు. రానున్న రోజుల్లో విశాఖపట్నం ఐటీ హబ్‌గా మారుతుందన్నారు. అచ్యుతాపురం వద్ద రూ.1.7 లక్షల కోట్లతో గ్రీన్ హైడ్రోజన్ హబ్ వస్తుందని, నక్కపల్లిలో ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ ప్లాంటు ఏర్పాటు కానుందని, ఫార్మా సెజ్ కూడా వస్తుందన్నారు. ఈ సమావేశంలో డీసీసీబీ చైర్మన్ కోన తాతారావు, పార్టీ నాయకుచి దూలం గోపి, తదితరులు పాల్గొన్నారు.

బియ్యపు గింజపై వినాయకుని రూపం



బియ్యపు గింజపై చెక్కిన వినాయకుని రూపం (ఇన్‌సెట్‌లో) సూక్ష్మ కళాకారుడు నైదండ గోపాల్

మాడుగుల రూరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి సందర్భంగా వినాయకుని రూపాన్ని బియ్యపు గింజపై అద్భుతంగా చెక్కి మరోసారి తన కళా నైపుణ్యాన్ని చాటుకున్నాడు మైక్రో ఆర్టిస్ట్ నైదండ గోపాల్. మండలంలోని ఎం.కోడూరు గ్రామానికి చెందిన గోపాల్ పండుగలు, పలు ప్రత్యేక సందర్భాల్లో గోపాల్ సూక్ష్మ కళాఖండాలు తయారు చేస్తుంటాడు. ఈ క్రమంలోనే వినాయక చవితి సందర్భంగా మంగళవారం బియ్యపు గింజపై సన్నపాటి బ్లేడుని ఉపయోగించి బూతద్దం సాయంతో ఐదు గంటల పాటు సేపు శ్రమించి అద్భుతంగా చెక్కి, వాటర్ కలర్స్ అద్దాడు. గోపాల్ తయారు చేసిన ఈ కళాఖండాన్ని చూసి పలువురు అభినందించారు.

ఓటరు జాబితాలపై డీఆర్‌వో సమావేశం

అనకాపల్లి కలెక్టరేట్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితాల్లో మార్పులు, చేర్పుల్లో అభ్యంతరాలు, పొరపాట్లు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని డీఆర్‌ఓ వై.సత్యనారాయణరావు రాజకీయ పార్టీల నేతలకు సూచించారు. కలెక్టరేట్‌లోని డీఆర్‌ఓ చాంబర్‌లో మంగళవారం వివిధ రాజకీయ పార్టీల నేతలతో ఓటరు జాబితాపై మాసాంతపు సమావేశం నిర్వహించారు. జిల్లాలో కొత్తగా ఓటరు నమోదు కోసం, ఓటరు ఐడీ కార్డుల సవరణ కోసం 1,354 దరఖాస్తులు అందాయని వీటిలో 820 దరఖాస్తులను పరిష్కరించామన్నారు. 534 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నట్టు ఆయన చెప్పారు. సమావేశంలో జిల్లా ఎన్నికల విభాగం పర్యవేక్షకులు ఎస్‌వీఎస్ నాయుడు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

మహిళ హత్య కేసులో వీడిన మిస్టరీ

... 5వ పేజీ తరువాయి

ఉంటున్నది. పెద్ద కుమార్తె అనూష పంజాబ్‌లోని యూనివర్సిటీలో చదువుతున్నది. 15 ఏళ్ల చిన్న కుమార్తె ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతూ, హాస్టల్‌లో వుంటున్నది. సంతు ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, చెడు వ్యసనాలకు లోనయి డబ్బులు వృథా చేస్తున్నది. ఈ విషయం తెలుసుకున్న కుమార్తెలతోపాటు సంతు మరిది మురళీధర్ ఇటీవల ఆమెతో గొడవపడ్డారు. కాగా హాస్టల్‌లో వుంటున్న చిన్న కుమార్తె ఇంటికి వచ్చినప్పుడు తల్లి ఫోన్‌లో అసభ్యకర దృశ్యాలతోపాటు బెట్టింగ్ యాప్‌లు వుండడాన్ని గుర్తించింది. ఈ విషయాన్ని అక్క అనూషకు చెప్పడంతో ఆమె పంజాబ్ నుంచి ఇక్కడకు వచ్చింది. ఇద్దరూ కలిసి తల్లిని నిలదీసి, ఆమెతో గొడవపడ్డారు. తల్లి ప్రవర్తనతో విసుగు చెందిన కుమార్తెలు... ఆమెను అంతమొందించాలని నిర్ణయించుకున్నారు. రాజీవ్‌నగర్‌లోనే నివాసం వుంటున్న బాబాయ్ మురళీధర్‌కు ఈ విషయం చెప్పి, ఆయన సాయం కోరారు. ముగ్గురూ కలిసి ప్రణాళికను రూపొందించుకుని ఈ నెల 13వ తేదీ అర్ధరాత్రి దాటిన తరువాత గాఢ నిద్రలో వున్న ఉన్న సంతుని హత్య చేశారు. అనంతరం మృతదేహాన్ని మురళీధర్ తన స్నేహితుడి కారులో సబ్బవరం మండలం బాటజంగాలపాలెం వద్దకు తీసుకువచ్చి పెట్రోల్ పోసి నిప్పంటించాడు. 14వ తేదీ ఉదయం అటుగా వెళుతున్న స్థానికులు, సగం కాలిన మహిళ మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సబ్బవరం పోలీసులు వెళ్లి వివరాలు సేకరించారు. విషయం తెలుసుకున్న ఎస్పీ తుహిన్ సిన్హా సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఈ కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న పోలీసు అధికారులు.. నిందితులను గుర్తించడానికి ప్రత్యేక బృందాలను నియమించారు. సంతుని ఆమె కుమార్తెలు, మరిది కలిసి హత్య చేసినట్టు సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా గుర్తించారు. మురళీధర్‌తోపాటు అనూషను మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మరో నిందితురాలు మైనర్ కావడంతో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందు హాజరుపరిచినట్టు ఎస్పీ చెప్పారు.

క్రైం... crime news

అంగన్‌వాడీ కార్యకర్త చికిత్స పొందుతూ మృతి

అచ్యుతాపురం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అంగన్‌వాడీ కార్యకర్త చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందిందని సీఐ నమ్మి గణేశ్ తెలిపారు. ఇందుకు సంబంధించి పూర్వాపరాలిలా వున్నాయి. మండలంలోని కుమారపురంలో అంగన్‌వాడీ కార్యకర్తగా పనిచేస్తున్న రాజాన మాధురి (25) జూన్ 26వ తేదీన వేరొకరి ద్విచక్రవాహనంపై అచ్యుతాపురం వస్తుండగా విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద లారీ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడింది. చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు విశాఖలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చారు. జూలై 30 వరకు చికిత్స చేయించిన తరువాత ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయపూర్‌లోని ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందింది. మాధురి ఏడు నెలల గర్భిణి. ముందస్తు ప్రసవం జరిగి బిడ్డ కూడా మృతిచెందింది. మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

అపహరించిన బైక్‌పై గంజాయి రవాణా

- రెండు కిలోల గంజాయి స్వాధీనం
- ఇద్దరి అరెస్టు

కె.కోటపాడు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): బైక్‌ను అపహరించి దానిపై గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరిని పోలీసులు మంగళవారం ఉదయం అరెస్టు చేశారు. వారి నుంచి రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి కె.కోటపాడు ఎస్ఐ ధనుంజయ్ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. స్టేషన్ పరిధిలో పోలీసులు మంగళవారం వాహన తనిఖీలు చేపడుతున్నారు. ఆ సమయంలో బైక్‌పై వస్తున్న ఇద్దరు.. పోలీసులను చూసి బైక్‌ను వదిలి పారిపోయేందుకు ప్రయత్నించారు. వారిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించి వారు కాకినాడకు చెందిన చెక్క దుర్గాప్రసాద్, వనమాడి జానకిరామ్‌గా తెలుసుకున్నారు. వారిద్దరూ అరకు మండలంలో గంజాయి కొనుగోలు చేసి డుంబ్రిగుడలో పార్కింగ్ చేసి ఉన్న బైక్‌ను అపహరించి కాకినాడకు బయలుదేరినట్టు విచారణలో తేలింది. వారిద్దర్నీ అరెస్టు చేసి రెండు కిలోల గంజాయి, బైక్, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు.

గంజాయి నిందితుడిని పట్టించిన సేఫ్ స్టే యాప్

రోలుగుంట, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): సేఫ్ స్టే యాప్ ద్వారా పరారీలో ఉన్న గంజాయి నిందితుడు పట్టుబడిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. దీనికి సంబంధించి ఎస్ఐ రామకృష్ణారావు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. గత ఏడాది జూన్ నెలలో రోలుగుంట మండలం ఎంకేపట్నం శివారులో 78 కిలోల గంజాయితో ముగ్గురు వ్యక్తులతో పాటు ఒక బైక్‌ను సీజ్ చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు కొయ్యూరు మండలం బచ్చింత గ్రామానికి చెందిన గెమ్మెలి చిన్నారావు అప్పటి నుంచి తప్పించుకు తిరుగుతున్నాడు. కాగా జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాలతో జిల్లాలోని అన్ని హోటళ్లు, లాడ్జీల్లో సేఫ్ స్టే యాప్‌ను యాజమాన్యం ద్వారా ఇన్‌స్టాల్ చేయించి ఆయా హోటళ్లు, లాడ్జీలకు వచ్చే గెస్ట్‌ల ఆధార్, ఫొటో తదితర వివరాలు నమోదు చేసి ఉంచుతున్నారు. ఆ వివరాలు జిల్లాలోని ఐటీ కోర్ టీమ్ వద్ద ఉన్న డేటా బేస్‌కు వెళుతుంది. అయితే తప్పించుకు తిరుగుతున్న గంజాయి నిందితుడు చిన్నారావు మంగళవారం ఉదయం నర్సీపట్నంలోని ఓ హోటల్‌లో బస చేయడంతో ఆ వివరాలు సేఫ్ స్టే యాప్ ద్వారా అలెర్ట్ మెసేజ్ నర్సీపట్నం సీఐకి వెళ్లింది. అక్కడ నుంచి సమాచారం రోలుగుంట ఎస్ఐ రామకృష్ణారావుకు వెళ్లింది. దీంతో నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

లైంగికదాడి కేసులో ముద్దాయికి 20 ఏళ్ల జైలు

విశాఖపట్నం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): బాలికపై లైంగిక దాడికి పాల్పడిన ముద్దాయికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.5వేలు జరిమానా విధిస్తూ పోక్సో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి మంగళవారం తీర్పుచెప్పారు. జరిమానా చెల్లించకుంటే మరో ఆరు నెలలు జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. బాధిత బాలికకు ప్రభుత్వం రూ.3 లక్షలు పరిహారంగా చెల్లించాలని సూచించారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ బత్తి రాజశేఖర్ తెలిపిన వివరాలివి.. భీమిలి మండలం తాటితూరుకు చెందిన ముద్దాయి సరగడ సన్యాసిరావు (45) గత ఏడాది ఏప్రిల్ 30న అమ్మమ్మతో కలిసి పశువులు మేపేందుకు వెళ్లిన బాలిక (8)ను బైక్‌పై వచ్చి సమీపంలోని మొక్కజొన్న తోటలోకి తీసుకువెళ్లి అత్యాచారం చేశాడు. తీవ్ర రక్తస్రావంతో బాలిక అమ్మమ్మకు విషయం చెప్పడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దిశ ఏసీపీ సీహెచ్ వివేకానంద కేసు దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ముద్దాయిపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి శిక్ష విధించారు.

తేగాడ మోడల్ స్కూలులో డీఈవో విచారణ



స్కూలు కమిటీ ప్రతినిధులు, ఉపాధ్యాయులను విచారిస్తున్న డీఈవో అప్పారావునాయుడు

కశింకోట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తేగాడలో వున్న మోడల్ స్కూల్‌లో జిల్లా విద్యాశాఖాధికారి అప్పారావునాయుడు మంగళారం విచారణ చేపట్టారు. పాఠశాలలో పలు అక్రమాలు జరుగుతు న్నాయని స్కూల్ కమిటీ వైస్‌చైర్మన్ శిలపరశెట్టి చిట్టమ్మ సోమవారం జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు డీఈవోతోపాటు, ఎంఈవోలు మూర్తి, వెంకటసురేశ్ మంగళవారం తేగాడ మోడల్ స్కూల్‌కు వెళ్లి విచారణ జరిపారు. మధ్యాహ్న భోజనంలో నాణ్యమైన ఆహారాన్ని ఇవ్వడంలేదని, కోడిగుడ్ల పంపిణీలో వంట మనిషి అక్రమాలకు పాల్పడుతున్నదని, విద్యార్థినులకు కంప్యూటర్, ఐటీ తరగతులు బోధించడం లేదన్న ఫిర్యాదులపై ఆరా తీశారు. హాస్టల్ విద్యార్థినులకు మెనూను సక్రమంగా అమలు చేయడం లేదని, సీసీ కెమెరాలు లేకపోవడం వల్ల గుర్తు తెలియని వ్యక్తులు హాస్టల్‌కు వస్తున్నారన్న వాటిపైనా విచారణ జరిపారు. ఇక్కడ విద్యార్థులను, ఉపాధ్యాయ సిబ్బందిని విచారించామని, నివేదికను రూపొందించి కలెక్టర్‌కు నివేదిస్తామని డీఈవో చెప్పారు.

108 వాహనంలో ప్రసవం

- తల్లీబిడ్డ క్షేమం



తల్లీ బిడ్డతో 108 వాహన సిబ్బంది

చోడవరం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): పురిటినొప్పులతో ఆస్పత్రికి బయలుదేరిన నిండు గర్భిణి 108 వాహనంలోనే ప్రసవించింది. బుచ్చెయ్యపేట మండలం గొన్నవానిపాలేనికి చెందిన డి.సావిత్రి పురిటినొప్పులతో బాధపడుతుంటే ఆమెను స్థానిక కమ్యూనిటీ ఆస్పత్రిలో సోమవారం రాత్రి చేర్పించారు. అయితే ఆమె పరిస్థితి విషమంగా ఉండడంతో అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి రిఫర్ చేశారు. సోమవారం అర్ధరాత్రి ఎన్టీఆర్ ఆస్పత్రికి 108 వాహనంలో తరలిస్తుండగా మామిడిపాలెం సమీపంలో ఆమెకు నొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో 108 సిబ్బంది వై.అప్పలనాయుడు, నాయుడులు ఆమెకు సుఖ ప్రసవం అయ్యేలా జాగ్రత్తలు తీసుకోవడంతో ఆమె వాహనంలోనే బిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగానే ఉండడంతో 108 సిబ్బందిని ఆమె కుటుంబ సభ్యులు అభినందించారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	108.00
లైవ్ ధర	128.00
విత్ స్కిన్	226.00
స్కిన్ లెస్	236.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	540
విజయనగరం	544
శ్రీకాకుళం	544